


'రైతుబంధుపై ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. రాష్ట్రంలో ఐదెకరాల వరకు ఉన్న 62 లక్షల మంది రైతులకు వారి ఖాతాల్లో డబ్బులు పడ్డాయి. భవిష్యత్‌లో రైతు భరోసాపై హామీ ఇస్తున్నాం. గత ప్రభుత్వంలో చెట్లు.. పుట్టలు, రాళ్లు, రప్పలు, లే-అవుట్ ఉన్న బంగ్లాలకు, నేషనల్ హీవే రహదారులకు, నాన్ అగ్రికల్చర్ ల్యాండ్‌లకు రైతుబంధు ఇచ్చారు. వాటన్నిం టికి ఫుల్‌స్టాప్ పెడతాం. రాబోయే కాలంలో రైతుబంధుపై సర్వే జరిపి.. స్క్రూట్నీ చేసి ఇలాంటి వాటన్నిటినీ తొలగిస్తాం. కొత్తగా పట్టాలు పొందిన వారు, రైతుబంధు రాని రైతులు కొత్తగా దరఖాస్తు పెట్టుకోవచ్చు. అర్హులైన రైతులను గుర్తించి రైతు భరోసాను వర్తింప చేస్తాం'

- ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి



కేసముద్రం మండలం తాళ్లపూసపల్లి శివారులో యూరియా చల్లుతున్న రైతు

రైతుబంధు సర్వే ఎన్నడు?

- ఇంకా విడుదల కాని విధివిధానాలు
- సీఎం సర్వే ప్రకటనతో బడా యజమానుల్లో గుబులు
- జిల్లాలో నాలుగు ఎకరాల రైతులకే అందిన సాయం
- ఎదురుచూస్తున్న మిగతా రైతులు

మహబూబాబాద్ అగ్రికల్చర్, మార్చి 29 : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వంద రోజులు పూర్తయింది. ఈ క్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి రైతుబంధు పథకంపై కీలక నిర్ణయం తీసుకున్నారు. బడా రైతులకు, సాగులో లేని వ్యవసాయ భూములకు, గ్రానైట్ క్వారీల యజమానులకు చెక్‌పెడుతూ... తీసుకున్న ఆ నిర్ణయం పట్ల రైతుల నుంచి హర్షం వ్యక్తమవుతోంది. అయితే ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు ఆ సర్వేపై విధివిధానాలు విడుదల చేయలేదు. రాష్ట్రంలో పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న కారణంగా సర్వే జరిపి అమలు చేయడానికి చాలా సమయం పట్టే అవకాశాలు కన్పిస్తున్నాయి. జిల్లాలో ఈ నెల 26 వరకు 1,80,298 మంది రైతులకు రూ.141.16 కోట్లు వారి ఖాతాల్లో జమ అయ్యాయి. ఇంకా 34,387 మంది రైతులకు రూ.91.90 కోట్లు పడాల్సి ఉంది. జిల్లాలోని మండలాల్లో నాలుగు ఎకరాల వరకే రైతుబంధు నిధులు పడ్డాయి.

రైతుబంధు ఇలా...

2018లో రైతుబంధు పథకాన్ని ప్రారంభించారు. ఎకరాకు రూ.5వేల చొప్పున రెండు విడతలుగా రైతుబంధు నిధులను విడుదల చేస్తారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం పోయి.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. రాష్ట్ర ఖజానాలో నిధులు లేకపోవడంతో రైతుబంధు నిధుల కోసం ప్రభుత్వం పాట్లు పడుతోంది. దీంతో దశల వారీగా రైతుబంధు నిధులను విడుదల చేస్తోంది. ఐదెకరాల వరకు రైతుబంధు నిధులు విడుదల చేస్తామని చెబుతున్నప్పటికి మహబూబాబాద్ జిల్లాలో మాత్రం నాలుగు ఎకరాల వరకే రైతుల ఖాతాల్లో జమ అయ్యాయి. జిల్లాలో ఈ యాసంగి సీజన్‌లో రైతుబంధు పథకానికి 2,14,685 మంది రైతులు అర్హులుగా తేల్చారు. వీరికి గాను రూ.233.07 కోట్లు వారి ఖాతాల్లో జమ చేయాలి. అయితే ఈ నెల 26 వరకు 1,80,298 మంది రైతులకు రూ.141.16 కోట్లు జమ చేశారు. ఇంకా 34,387 మంది రైతులకు రూ.91.90 కోట్లు ఖాతాల్లో జమ చేయాల్సి ఉంది. అయితే మొత్తం 2,14,685 మంది రైతులకు గాను 1,94,675 మంది రైతులకు రూ.170.84 కోట్ల నిధులకు సంబంధించిన వివరాలను సబ్‌ట్రెజరీకి జిల్లా వ్యవసాయాధికారులు పంపించారు.

సాయం అందుకోని రైతులు

జిల్లాలో 17 మంది రైతులు మాత్రం వివిధ కారణాలతో ఈ సీజన్‌లో రైతుబంధు పెట్టుబడి సాయం తీసుకోలేదు. గార్ల మండలంలో ఒకరు, కేసముద్రంలో ఇద్దరు, మహబూబాబాద్‌లో ఒకరు, దంతాలపల్లిలో ఇద్దరు, కురవిలో తొమ్మిది మంది, మరిపెడలో ఇద్దరు బడా రైతులు రైతుబంధు పెట్టుబడి సాయం తీసుకోలేదని జిల్లా వ్యవసాయాధికారులు చెబుతున్నారు. అయితే పథకం ప్రారంభంలో మాత్రం రైతుబంధు తీసుకోవద్దని, ఆ నిధులను ప్రభుత్వానికి వాపసు ఇచ్చేయాలని గత ప్రభుత్వం కోరడం జరిగింది. కొంత మంది ప్రజాప్రతినిధులు, బడా నాయకులు ఓసారి రైతుబంధు చెక్కులను తీసుకుని ప్రభుత్వానికి వాపసు ఇచ్చి శభాష్ అనిపించుకున్నారు. ఆ తర్వాత నుంచి మళ్లీ రైతుబంధు తీసుకోవడం గమనార్హం.

బడా రైతుల్లో గుబులు

రైతుబంధు పథకంపై సీఎం రేవంత్‌రెడ్డి సర్వే చేయిస్తానని ప్రకటించారు. అయితే సర్వే చేయడానికి ఎన్నికల కోడ్ అమల్లో ఉండడంతో అడ్డంకిగా మారిందని తెలుస్తోంది. దాంతో ప్రభుత్వం ఇంకా ఈ పథకంపై విధివిధానాలు ప్రకటించలేదు. ఎన్నికలు అయిపోయాక విధివిధానాలు ప్రకటిస్తారని పలువురు భావిస్తున్నారు. ఆ తర్వాత రైతుబంధుపై పూర్తిస్థాయి సర్వే జరుగనుంది. ఇదిలా ఉండగా ఐదు ఎకరాల వరకు ఇస్తారా...? పదెకరాల వరకు ఇస్తారా..? అనేది ప్రభుత్వం నుంచి స్పష్టత లేదు. సర్వే జరగాలంటే ఒక వ్యవసాయ శాఖ మాత్రమే కాకుండా రెవెన్యూ ఆటవీ, మైనింగ్ శాఖలు జాయింట్ సర్వే చేయాల్సి ఉంటుందని తెలుస్తోంది. కాగా, జిల్లాలోని అనేక గ్రామాల్లో బ్లాక్ గ్రానైట్ క్వారీలు, కంకర క్వారీలు, ప్లాట్‌ల వెంచర్లు, సాగులో లేని భూములకు భారీగా రైతుబంధు నిధులు వస్తున్నాయి. అలాంటి వాటిని అరికట్టడంలో గత ప్రభుత్వం విఫలమైంది. సీఎం సర్వే చేస్తే ఈ బడా బాబుల బాగోతం బయట పడనుంది. దీంతో బడా బాబుల గుండెల్లో సర్వే గుబులు నెలకొంది. ఏదేమైనా ఇంకా రైతుబంధు అందని రైతులు మాత్రం ఎదురుచూస్తున్నారు.

ఇంకా విధి విధానాలు రాలేదు : అభిమన్యు, జిల్లా వ్యవసాయాధికారి

రైతుబంధు పథకంపై ముఖ్యమంత్రి కీలక నిర్ణయం తీసుకుని సర్వే చేయిస్తామని ప్రకటించారు. అయితే సర్వే చేయడానికి ఎలాంటి విధివిధానాలు అందలేదు. అవి అందితేనే సర్వేపై పూర్తి వివరాలు తెలుస్తాయి.

లోక రక్షణార్థమే క్రీస్తు మరణం

- కుల, మత రహిత సమాజం కోసం పరితపించారు
- కాజీపేట ఫాతిమా చర్చి పీఠాధిపతి ఉడుముల బాల
- వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మురళీనాయక్



శనిగపురం ఏసుగుట్ట చర్చి వద్ద గుడ్‌ఫ్రైడే వేడుకల్లో పాల్గొన్న కాజీపేట ఫాతిమా క్యాథలిక్ చర్చి పీఠాధిపతి ఉడుముల బాల, ఎమ్మెల్యే మురళీనాయక్

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, మార్చి 29 : లోక రక్షణార్థమే ఏసుక్రీస్తు సిలువ వేయబడి మరణం పొందారని కాజీపేట ఫాతిమా క్యాథలిక్ చర్చి పీఠాధిపతి ఉడుముల బాల అన్నారు. మహబూబాబాద్ పట్టణంలో శుక్రవారం ఉడుముల బాల నేతృత్వంలో ఫాతిమా స్కూల్ నుంచి శనిగపురం ఏసుగుట్ట వరకు సుమారు ఐదు కిలోమీటర్ల వరకు ఏసు సిలువతో పాదయాత్ర నిర్వహించి గుడ్‌ఫ్రైడే వేడుకలను జరుపుకున్నారు. అనంతరం ఏసుగుట్టపై క్రైస్తవులకు బిషప్ ఉడుముల బాల దైవ సందేశం అందించారు. అన్ని దానాల్లో కెల్ల ప్రాణదానం గొప్పదని చెప్పారు. జిల్లా ప్రజలు ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు. కులం, మతం, జాతి అనే తారతమ్యాలు లేకుండా ప్రపంచ వ్యాప్తంగా గుడ్‌ఫ్రైడే వేడుకలు జరుపుకుంటున్నట్లు చెప్పారు. మహబూబాబాద్, కేసముద్రం, నెల్లికుదురు, కురవి మండలాల నుంచి బంజారాలు, క్రైస్తవులు పెద్ద ఎత్తున తరలివచ్చి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఫాదర్ సైమన్, పాల్‌రాజ్, పీటర్, జోసెఫ్, కిరణ్, కిషోర్ పాల్గొన్నారు.

ఏసు చూపిన మార్గాన్ని అనుసరించాలి : ఎమ్మెల్యే

మహబూబాబాద్ మునిసిపల్ పరిధిలోని శనిగపురం ఏసుగుట్ట వద్ద ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ కాజీపేట క్యాథలిక్ చర్చి పీఠాధిపతి ఉడుముల బాలతో కలిసి గుడ్‌ఫ్రైడే వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మురళీనాయక్ మాట్లాడుతూ.. ఏసు చూపిన శాంతి మార్గాన్ని అనుసరించి ప్రజలంతా సుఖశాంతులు, ఆయురారోగ్యాలతో జీవించాలని కోరారు. ప్రపంచానికి శాంతి సందేశాన్ని ఇస్తూ జీసస్ చేసిన త్యాగానికి గుర్తుగా జరుపుకునేదే గుడ్‌ఫ్రైడే అని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు శంతన్‌రామరాజు, కౌన్సిలర్లు హరిసింగ్, శ్రీను పాల్గొన్నారు.

- సీరోలు మండలం ఉప్పరగూడెం యేసుకృపా మందిరంలో పాస్టర్ జాన్‌మార్క్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో రూతు, షీబ, సంతోషమ్మ, లూథియమ్మ, షాలోన్, శైని, యోహాను, వీరన్న, పాల్, డేవిడ్ పాల్గొన్నారు.
- డోర్నకల్‌లో గుడ్‌ఫ్రైడే సందర్భంగా సీఎస్ఐ, ఆర్సీఎం చర్చిల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఆయా వేడుకల్లో పాస్టర్లు, క్రైస్తవులు పాల్గొన్నారు.



రసకందాయం

పొలిటికల్ ట్విస్టులతో ఉత్కంఠగా ఓరుగల్లు రాజకీయం

- కడియం ఎంట్రీతో కాంగ్రెస్ ఆశావహుల్లో టెన్షన్
- టికెట్ కోసం రెండు నెలలుగా ప్రయత్నాలు
- ఎంపీ టికెట్ కడియంకు ఇస్తే తమ పరిస్థితేంటోనని ఆందోళన
- వరంగల్ అభ్యర్థి కోసం 'గులాబీ' పార్టీ అన్వేషణ
- అవకాశం ఇవ్వాలని ఉద్యమకారుల డిమాండ్
- తెరపైకి పెద్ది స్వప్న, డిన్నా, జోరిక తదితరుల పేర్లు

వరంగల్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : నేతలు ఇస్తున్న ట్విస్టులతో ఓరుగల్లు పాలిటిక్స్ రక్తికడుతున్నాయి. లోక్‌సభ ఎన్నికలకు సమయం సమీపిస్తుండటంతో ప్రధాన పార్టీలు తమ వ్యూహాలకు పదను పెడుతున్నాయి. దీంతో అనూహ్యంగా బీఆర్‌ఎస్ అభ్యర్థిగా ప్రకటించిన కడియం కావ్య ఎన్నికల్లో పోటీ చేయలేనని చెప్పి, తన తండ్రి ఎమ్మెల్యే కడియం శ్రీహరితో కలిసి కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధం కావడం చర్చనీయాంశమైంది. అయితే ఇన్నాళ్లు కాంగ్రెస్ ఎంపీ టికెట్ కోసం విశ్వప్రయత్నాలు చేస్తున్న నేతలకు ఇది మింగుపడటం లేదు. వరంగల్ టికెట్ కడియంకు ఇస్తే తమ పరిస్థితి ఏమిటనే ఆందోళనలో ఆశావహులున్నారు. కావ్య ఇచ్చిన షాక్ నుంచి తేరుకుంటున్న గులాబీ నేతలు వరంగల్ అభ్యర్థిని ఎంపిక చేసే పనిలో నిమగ్నమవడంతో తెరపైన అనేక మంది ఆశావహులు క్యూ కడుతున్నారు. అనూహ్య మలుపులతో ఒక్కసారిగా ఓరుగల్లు రాజకీయాలు ఉత్కంఠగా మారాయి.

కడియం పొలిటికల్ యూటర్న్..

ఓరుగల్లు రాజకీయాలు యూటర్న్ తీసుకున్నాయి. అనూహ్య నిర్ణయాలతో రాష్ట్ర వ్యాప్తంగా వరంగల్ పాలిటిక్స్ హాట్‌హాట్‌గా మారాయి. అనూహ్య పరిణామాల మధ్య ఈ నెల 13న స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కుమార్తె డాక్టర్ కడియం కావ్యను బీఆర్‌ఎస్ వరంగల్ ఎంపీ అభ్యర్థిగా ప్రకటించింది. ఈ నెల 31న మడికొండలో ఉమ్మడి జిల్లా ముఖ్యనేతల సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. మాజీ మంత్రి హరీశ్‌రావు ముఖ్యఅతిథిగా పాల్గొననున్నారు. ఈ ఏర్పాట్లలో ఉన్న బీఆర్‌ఎస్ శ్రేణులకు కడియం కావ్య గురువారం రాత్రి విడుదల చేసిన లేఖ కంటిమీద కునుకు లేకుండా చేసింది. పోటీ నుంచి తప్పుకోవడమే కాకుండా కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధమవుతుండటం కేడర్‌లో ఆందోళన వ్యక్తమవుతోంది. బీఆర్‌ఎస్‌లో కీలక నేతగా ఉన్న కడియం శ్రీహరి తన కుమార్తెతో కలిసి కాంగ్రెస్‌లో చేరి, కాంగ్రెస్ తరపున ఎన్నికల బరిలో దిగేందుకు ప్రయత్నాలు చేయడం రాజకీయవర్గాల్లో హాట్‌టాపిక్‌గా మారింది. ఈ మేరకు శుక్రవారం రాష్ట్ర ఏఐసీసీ వ్యవహారాల ఇన్‌చార్జ్ దీపా దాస్ మున్షి, కాంగ్రెస్ నేతలు మల్లు రవి, సంపత్‌కుమార్, రోహిత్ చౌదరి, విష్ణునాథ్, రోహిన్‌రెడ్డి తదితరులు హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లోని కడియం ఇంటికి వెళ్లి కాంగ్రెస్‌లో రావాల్సిందిగా ఆహ్వానించారు. అందుకు

మిగతా 7వ పేజీలో..

తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలి

- పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి



అధికారులకు సూచనలు ఇస్తున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

తొర్రూరు, మార్చి 29 : ప్రస్తుత వేసవి కాలంలో ప్రజలకు తాగునీటికి ఇబ్బందులు కలుగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి అన్నారు. తొర్రూరులోని మంచినీటి సరఫరా బావిని శుక్రవారం సందర్శించి అధికారులకు పలు సూచనలు చేశారు. పట్టణ ప్రజలకు సురక్షితమైన తాగునీటిని అందించాలని, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని తెలిపారు. ప్రభుత్వం వేసవిలో నీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక చర్యలు చేపడుతుందన్నారు.

పైపులైన్ల రిపేరు, గేట్ వాల్స్, ట్యాంకులను శుద్ధి చేయడం తదితర పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. తాగునీటి కోసం ప్రజలు ఫోన్ చేస్తే అధికారులు, సిబ్బంది వెంటనే స్పందించాలన్నారు. ప్రభుత్వం ప్రత్యేక నిధులు విడుదల చేసినందున సద్వినియోగం చేసుకొని ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పెదగాని సోమయ్య, సోమ రాజశేఖర్, సంతోష్, మునిసిపల్ పాలకవర్గ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటా..

తొర్రూరు రూరల్ : కాంగ్రెస్ పార్టీ ప్రతీ కార్యకర్తకు అండగా ఉంటానని ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. మండలంలోని హరిపిరాల గ్రామంలో మండల పార్టీ అధ్యక్షుడు సుంచు సంతోష్ తల్లి అనారోగ్యంతో బాధపడుతుండగా శుక్రవారం పరామర్శించారు. అనంతరం కార్యకర్తలతో కలిసి అక్కడే అల్పాహారం తీసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం కష్టపడిన ప్రతీ కార్యకర్తకు అండగా ఉంటానని, ఎలాంటి ఆందోళన చెందవద్దన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి గెలుపు కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు సుంచు సంతోష్, పట్టణ అధ్యక్షుడు సోమ రాజశేఖర్, గ్రామ శాఖ అధ్యక్షుడు అశోక్, నాయకులు పాల్గొన్నారు.

డీజే సౌండ్ బాక్సులు మీదపడి బాలుడి మృతి



బానోత్ మనోజ్ (ఫైల్)

సీరోలు, మార్చి 29 : డీజే సౌండ్ బాక్సులు మీద పడి ఓ బాలుడు మృతి చెందాడు. ఈ సంఘటన సీరోలు మండలం ఉప్పరగూడెం గ్రామ శివారు పీక్లతండాలో శుక్రవారం సాయంత్రం చోటు చేసుకుంది. సీరోలు ఎస్సై విజయ్‌రాంకుమార్ తెలిపిన వివరాల ప్రకారం... ఉప్పరగూడెం శివారు పీక్లతండాలో ఓ వివాహ వేడుకలకు డీజే సౌండ్ సిస్టంను ఏర్పాటు చేసుకున్నారు. ఈ క్రమంలో తండాకు చెందిన బానోత్ శ్రీను, భద్రి దంపతుల కుమారుడు మనోజ్(14) కూడా డీజే బాక్సుల వద్దకు వెళ్లి పక్కన నిలబడి నృత్యాలను చూస్తున్నారు. ఈ క్రమంలో డీజే బాక్సులు ఒక్కసారిగా మనోజ్‌పై పడడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. తల్లిదండ్రులు వ్యవసాయం చేస్తుండగా, మనోజ్ ఆరవ తరగతి చదువుతున్నాడు. కాగా, తండ్రి శ్రీను ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఎన్నికల ఫ్లయింగ్‌స్క్వాడ్ పైసా వసూల్?

- ఖాళీ సీసాల వ్యాపారి నుంచి రూ.15వేలు కలెక్షన్!
- కలెక్టర్‌కు బాధితుడి ఫిర్యాదుతో వెలుగులోకి
- ముగ్గురు ఉద్యోగులతో పాటు మరో ఇద్దరిపై కేసు

మహబూబాబాద్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఎన్నికల ఫ్లయింగ్‌స్క్వాడ్‌గా నియమితులైన ఓ ఇరిగేషన్ ఏఈ, ఓ సివిల్ హెడ్ కానిస్టేబుల్, ఓ ఎంపీడీవో కార్యాలయ అటెండర్, ప్రైవేట్ ఫొటోగ్రాఫర్, కారు డ్రైవర్ కలిసి ఎన్నికల విధుల మాటున అక్రమ వసూలుకు పాల్పడ్డట్లు సమాచారం. ఈ బృందానికి రూ.15వేల వరకు సమర్పించుకున్న బాధితుడు శుక్రవారం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో వారి బండారం బయటపడినట్లు తెలిసింది. కలెక్టర్ ఆదేశాలతో రంగ ప్రవేశం చేసిన పోలీసులు ఐదుగురిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారని సమాచారం. విశ్వసనీయ సమాచారం మేరకు లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ విడుదలతోనే కోడ్ అమల్లోకి రావడంతో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ ప్రతీ మండలానికి ముగ్గురు ఉద్యోగులతో ఎలక్షన్ ఫ్లయింగ్‌స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేశారు. మహబూబాబాద్ మండలానికి నియమించిన ఫ్లయింగ్‌స్క్వాడ్ బృందం గురువారం ఇదే మండలంలోని రెడ్యాల ప్రాంతంలో ఖాళీ సీసాలు అమ్ముకునే వ్యాపారిని అడ్డుకున్నట్లు తెలిసింది. అతడిని బెదిరించి రూ.15వేలు డిమాండ్ చేయగా.. రూ.10వేలు నగదు ఇచ్చిన బాధితుడు మరో రూ.5వేలను ఫొటోగ్రాఫర్‌కు ఫోన్‌పే చేసినట్లు తెలిసింది. అతడు తనకు జరిగిన అన్యాయంపై శుక్రవారం జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. కలెక్టర్ ఆదేశాలతో రంగంలోకి దిగిన పోలీసులు ఆ ఐదుగురిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. ఎన్నికల విధులను అడ్డంపెట్టుకుని అక్రమాలకు పాల్పడ్డట్లు ప్రాథమికంగా గుర్తించిన పోలీసులు సమగ్ర నివేదికను జిల్లా అధికారులకు అందజేసిన తర్వాత కేసు నమోదు, ఇతరత్రా వివరాలు వెల్లడించనున్నట్లు తెలిసింది.

రేపు దేవరుప్పులకు కేసీఆర్ రాక

ఎండిన పంటలను పరిశీలించనున్న బీఆర్‌ఎస్ అధినేత | 6

ఘరానా మోసం

- ఉద్యోగాలు ఇప్పిస్తామని రూ.4.50కోట్లు వసూలు
- ముఠాలోని తొమ్మిది మందిలో ఒకరి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ

వరంగల్ క్రైం, మార్చి 29: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో గ్రూపు-1 ఉద్యోగా లు ఇప్పిస్తామని మోసం చేస్తూ పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేసిన తొమ్మిదిమంది ముఠా సభ్యుల్లో ఒకరిని సుబేదారి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వరంగల్ పిన్నవారి వీధికి చెందిన కొత్త వీరేశం అనే వ్యక్తిని గురువారం అదుపులోకి తీసుకుని రూ.25లక్షల విలువ కలిగిన నగదు, బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను శుక్రవారం సుబేదారి పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో హనుమకొండ ఏసీపీ దేవేందర్‌రెడ్డి వెల్లడించారు. తన కుమారుడికి గ్రూప్-1 ఉద్యోగం ఇప్పిస్తానని 2020లో కొత్త వీరేశం తన నుంచి రూ.2.5 కోట్లు తీసుకుని మోసం చేశాడని వారం శ్రీదేవి అనే మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు దేవేందర్‌రెడ్డి తెలిపారు. ఫిర్యాదుపై విచారణ చేపట్టిన

మిగతా 8వ పేజీలో..

కుటుంబ సభ్యుడిలా సేవ చేయాలి

- చిన్న వయసులో హుస్సేన్‌నాయక్‌కు పెద్ద అవకాశం
- మాజీ ఎంపీ గరికపాటి మోహన్‌రావు

మహబూబాబాద్ టౌన్, మార్చి 29 : దేశ వ్యాప్తంగా ఉన్న గిరిజనులందరిని జాటోతు హుస్సేన్‌నాయక్ తన కుటుంబ సభ్యుల్లాగా భావించి వారికి సేవ చేయాలని మాజీ ఎంపీ గరికపాటి మోహన్‌రావు అన్నారు. చిన్న వయసులో హుస్సేన్‌నాయక్‌కు పెద్ద అవకాశం దక్కిందని తెలిపారు. మహబూబాబాద్‌లోని నందన గార్డెన్స్‌లో శ్రీ వివేకానంద విద్యాసంస్థల ఆధ్వర్యంలో శుక్రవారం జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోతు హుస్సేన్‌నాయక్ పౌరసన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీ వివేకానంద విద్యాసంస్థల సెక్రటరీ ఎడ్ల అశోక్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గరికపాటి మోహన్‌రావు మాట్లాడుతూ.. జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులుగా ఇప్పటి వరకు తెలంగాణ, ఏపీలో ఎవరికి అవకాశం రాలేదని, మొట్టమొదటగా హుస్సేన్‌నాయక్‌కు దక్కిందని అన్నారు. ఇది యావత్ తెలంగాణ గిరిజనులకు దక్కిన గౌరవంగా భావించాలన్నారు. అట్టడుగు వర్గాలకు కేంద్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందనడానికి ఇదొక ఉదాహరణగా చెప్పారు. ఎస్టీ కమిషన్ సభ్యులుగా ముగ్గురు ఉంటే అందులో మానుకోట జిల్లావాసి హుస్సేన్‌నాయక్ ఒక్కరని తెలిపారు. మారుమూల తండా నుంచి ఢిల్లీ గడ్డపై అడుగు పెట్టారన్నారు. సన్మానాలకు పొంగిపోవద్దని, వాటిని బాధ్యతగా గుర్తించి సేవ చేయాలన్నారు. యావత్ భారత దేశ గిరిజనులకు ఆప్తబంధువుగా మెలుగుతూ వారి అభ్యున్నతికి కృషి చేయాలని సూచించారు.

ఏ స్థాయిలో ఉన్నా మానుకోటను మరువను..

తాను ఏ స్థాయిలో ఉన్నా పుట్టిన మానుకోట గడ్డను మరువనని, ఈ ప్రాంత ప్రజల ఆశీర్వాదంతో తనకు ఉన్నత స్థాయి పదవి దక్కిందని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోతు హుస్సేన్‌నాయక్ అన్నారు. దేశ వ్యాప్తంగా గిరిజనులకు సేవ చేసే భాగ్యం కేంద్రం కల్పించిందని పేర్కొన్నారు. ఎంతో మంది గొప్ప వ్యక్తులు ఉన్నారని, అయినా తన కష్టం చూసి అవకాశం కల్పించారని, వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా పని చేస్తానని స్పష్టం చేశారు. గిరిజనుల పక్షాన నిలుస్తూ వారి అభ్యున్నతికి పాటు పడుతానన్నారు.



జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్‌నాయక్‌ను సన్మానిస్తున్న మాజీ ఎంపీలు గరికపాటి మోహన్‌రావు, సీతారాంనాయక్

మాజీ ఎంపీ అజ్మీరా సీతారాంనాయక్ మాట్లాడుతూ.. హుస్సేన్‌నాయక్‌కు గొప్ప అవకాశం లభించిందని, దానిని సద్వినియోగం చేసుకుని గిరిజనులకు న్యాయం చేయాలని సూచించారు. గిరిజన జాతి అభ్యున్నతికి పాటుపడాలని కోరారు. అనంతరం హుస్సేన్‌నాయక్‌ను శాలువాలతో సత్కరించి మెమొంటోలు అందజేశారు. జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడిగా బాధ్యతలు చేపట్టి తొలిసారిగా మానుకోటకు వచ్చిన హుస్సేన్‌నాయక్‌కు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్, ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, శ్రీధర్‌రెడ్డి, కట్టా సుధాకర్‌రెడ్డి, సునిల్‌రెడ్డి, వద్దిరాజు రాంచందర్‌రావు, వల్లభు వెంకటేశ్వర్లు, చీకటి మహేష్, చెల్పూరి వెంకన్న, మాధవపెద్ది శశివర్దన్‌రెడ్డి, ధర్మారెడ్డి, క్యాచువల్ శ్యాంసుందర్‌శర్మ, ఎర్రంరెడ్డి సిద్ధార్థ్‌రెడ్డి, గడ్డం అశోక్, వెన్నమల్ల అజయ్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ కౌలు రైతు మృతి

ఐనవోలు, మార్చి 29: పురుగుల మందు తాగిన కౌలు రైతు చికిత్స పొందుతూ ఆస్పత్రిలో మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై అనిల్‌కుమార్ కథనం ప్రకారం.. ఐనవోలుకు చెందిన చింత సారయ్య(47) తనకున్న ఎకరం భూమితోపాటు మూడెకరాల భూమి కౌలుకు తీసుకొని సాగుచేశాడు. పంట పెట్టుబడులకోసం అప్పుచేశాడు. దిగుబడులు సరిగా రాకపోవడంతో ఆర్థికంగా నష్టపోయాడు. చేసిన అప్పులు చెల్లించలేక మనస్థాపానికి గురై ఈ నెల 27న పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతిచెందాడు. అప్పుల బాధతో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడని కుమారుడు సామ్యేల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బెల్టుషాపులపై పోలీసుల దాడి



శ్రీపతిపల్లిలో స్వాధీనం చేసుకున్న లిక్కర్

వరంగల్ క్రైం, మార్చి 29: టాస్క్‌ఫోర్స్ పోలీసులు పలుచోట్ల బెల్టు షాపులపై దాడులు నిర్వహించారు. శుక్రవారం నాలుగుచోట్ల చేసిన దాడుల్లో రూ.40వేల లిక్కర్‌ను స్వాధీనం చేసుకుని విక్రయిస్తున్న నలుగురిపై కేసు నమోదు చేశారు. మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని శివనగర్ రూ.11,100, ఇదే ప్రాంతలోని మరో రెండుచోట్ల రూ.6,260, రూ.8,840 చెల్పూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని శ్రీపతిపల్లి లో రూ.13,160 విలువైన లిక్కర్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ విషయాన్ని టాస్క్‌ఫోర్స్ ఏసీపీ ఎ.మధుసూదన్ ధ్రువీకరించారు. అక్రమంగా మద్యం విక్రయాలు జరిపితే కేసులు పెడతామని ఆయన హెచ్చరించారు.

రేపు దేవరుప్పులకు కేసీఆర్ రాక

ఎండిన పంటలను పరిశీలించనున్న బీఆర్ఎస్ అధినేత

జనగామ, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ జిల్లాల బాట పట్టారు. ఎండిన పంటలను పరిశీలించి రైతులతో మాట్లాడనున్నారు. జనగామ, సూర్యాపేట, నల్లగొండ జిల్లాల్లో ఆదివారం పర్యటించనున్న ఆయన జనగామ జిల్లా దేవరుప్పుల మండలంలో ఎండిన పంటలను పరిశీలిస్తారు. ఆదివారం ఉదయం 8 గంటలకు గజ్వేల్‌లోని తన వ్యవసాయ క్షేత్రం నుంచి బయలుదేరి జనగామ మీదుగా 10.30 గంటలకు దేవరుప్పుల మండలానికి చేరుకుంటారు. దేవరుప్పుల మండలంలోని ధరావత్‌తండా, ధర్మాపురం గ్రామాల్లో ఎండిన పంటలను పరిశీలించి రైతులకు భరోసా కల్పిస్తారు. అక్కడ నుంచి సూర్యాపేట జిల్లా తుంగతుర్తి, తర్వాత నల్లగొండ జిల్లా హాలియాకు వెళ్లి పంటలను పరిశీలిస్తారు. కేసీఆర్ జనగామ పర్యటన నేపథ్యంలో ఆయనకు స్వాగతం పలికేందుకు జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్, పాలకుర్తి నియోజకవర్గాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు సిద్ధమవుతున్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్‌కు గడ్డు పరిస్థితులు ఎదురవుతున్న సమయంలో కేసీఆర్ ఆకస్మికంగా జిల్లాల పర్యటన చేపట్టడం, అది కూడా ఎండిన పంటల పరిశీలనకు రావడం చర్చనీయాంశమైంది. బీఆర్ఎస్‌కు చెందిన కీలక నేతలు ఒక్కొక్కరుగా పార్టీని వీడుతున్న క్రమంలో ఆయన జిల్లాల పర్యటన ద్వారా బీఆర్ఎస్ శ్రేణుల్లో భరోసానివ్వాలని భావిస్తున్నారు. అయితే బీఆర్ఎస్ నుంచి నేతల వలసలు, ఫోన్ ట్యాపింగ్ పరిణామం, కవిత లిక్కర్ కేసు లాంటి అంశాల నుంచి ప్రజల దృష్టి మరల్చడంలో భాగంగానే కేసీఆర్ ఈ పర్యటన చేపట్టారన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

పద్మావతి ఎక్స్‌ప్రెస్ రైలు బోగీలో పొగలు

భయాందోళనలకు గురైన ప్రయాణికులు

కాజీపేట, మార్చి 29: సికింద్రాబాద్ నుంచి తిరుపతి వెళ్తున్న పద్మావతి ఎక్స్‌ప్రెస్ బీ-4 కింద భాగంలోని బ్యాటరీలో శుక్రవారం రాత్రి పొగలు వచ్చాయి. సికింద్రాబాద్ నుంచి స్టేషన్ ఘన్‌పూర్ రైల్వే స్టేషన్ రాగానే బీ - 4 బోగీ కింద చిన్నగా పొగలు రావడంతో గమనించిన ప్రయాణికులు రైలు కాజీపేట హాల్టింగ్ కాగానే స్టేషన్ మాస్టర్‌కు సమాచారం ఇచ్చారు. దీంతో అప్రమత్తమైన రైల్వే అధికారులు.. బోగీవద్దకు చేరుకుని సమస్యను గుర్తించారు. ఎలక్ట్రికల్ స్టాఫ్‌కు, ఆర్పీఎఫ్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. దీంతో హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకున్న ఎలక్ట్రికల్ సిబ్బంది దెబ్బతిన్న బ్యాటరీని తొలగించారు. కొత్త బ్యాటరీని అమర్చి పంపారు. దీంతో రైలు రాత్రి 10 గంటలకు బయలు దేరి రెండు గంటలు ఆలస్యంగా వెళ్లింది. ఎలాంటి ప్రమాదం జరగక పోవడంతో రైల్వే అధికారులు, ప్రయాణికులు ఊపిరిపీల్చుకున్నారు.

పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి

ఓటర్లను ఆకట్టుకునేలా అందంగా తీర్చిదిద్దేందుకు చర్యలు ● వరంగల్, మానుకోట లోకసభ స్థానాల్లో పెరిగిన సంఖ్య

ఆ మేరకు అదనంగా పోలింగ్ కేంద్రాలు.. సౌకర్యాలపై దృష్టి ● ఒకే కుటుంబం ఓట్లు ఒకే పోలింగ్ కేంద్రంలో ఉండేలా చర్యలు



హనుమకొండ, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ఎన్నికల సంఘం లోక్‌సభ ఎన్నికల నగారాను మోగించడంతో క్షేత్రస్థాయిలో అధికారులు ముమ్మరంగా ఏర్పాట్లు చేయడంలో మునిగిపోయారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలతో పోలింగ్ కేంద్రాల మార్పులు చేర్పులతో పాటు కీలకమైన అంశాలపై కసరత్తు జోరుగా సాగుతోంది. పెరిగిన ఓటర్లను దృష్టిలో పెట్టుకొని ఇప్పటికే అధికారులు కొత్త పోలింగ్ కేంద్రాలను గుర్తించి ప్రతిపాదనలు పంపడం పూర్తయింది. ఓటర్ల సంఖ్యకు అనగుణంగా కొత్త పోలింగ్ కేంద్రాలు ఏర్పాటుపై దృష్టి సారించారు. పోలింగ్ కేంద్రాలు దూరంగా ఉండడం వల్ల ఓటు హక్కు వినియోగించుకోవడానికి ఓటర్లు ఆసక్తి చూపడం లేదన్న విషయాన్ని పరిగణలోకి తీసుకొని కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారు.

రెండు లోకసభ నియోజకవర్గాల పరిధిలో..

వరంగల్ లోకసభ పరిధిలో వరంగల్ తూర్పు, వరంగల్ పశ్చిమ, భూపాలపల్లి, పరకాల, స్టేషన్‌ఘనపూర్, పాలకుర్తి, వర్ధన్నపేట, అసెంబ్లీ సెగ్మెంట్లు ఉన్నాయి. ఈ నియోజకవర్గాల్లో కలిసి మొత్తం 18,16,500 మంది ఓటర్లు ఉన్నారు. 1899 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. వీటిలో 419 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలుగా గుర్తించారు. కాగా మహబూబాబాద్ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లు- డోర్నకల్ (ఎస్టీ) మహబూబాబాద్ (ఎస్టీ) నర్సంపేట, ములుగు (ఎస్టీ), పినపాక (ఎస్టీ) ఎల్లందు (ఎస్టీ) భద్రాచలం (ఎస్టీ) ఉన్నాయి. ఈ నియోపక వర్గం పరిధిలో మొత్తం 15,26,998 మంది ఓటర్లు ఉన్నారు. 1783 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. ఈ రెండు పార్లమెంట్ నియోజకవర్గాల్లో గతంలో కన్నా 2 లక్షల మందికిపైగా ఓటర్లు పెరిగారు. ఆమేరకు పోలింగ్ కేంద్రాలు కూడా పెరిగాయి.

ఒకే చోట ఓటేసేలా..

ఒకే కుటుంబంలోని సభ్యులందరూ ఒకే పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కు వినియోగించుకునేలా ఏర్పాట్లు చేయడంపై అధికారులు దృష్టి సారించారు. శాసనసభ ఎన్నికల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను లోకసభ ఎన్నికల్లో కొనసాగించనున్నారు. ఒక కుటుంబంలో సాధారణంగా మూడు నాలుగు ఓట్లు ఉంటాయి. ఉమ్మడి కుటుంబంలో ఈ సంఖ్య రెట్టింపు ఉండొచ్చు. అయితే అక్కడక్కడ కొన్ని కుటుంబాల్లో ఒకరు ఓ పోలింగ్ కేంద్రంలో, మరొకరు మరో పోలింగ్ కేంద్రంలో ఓటేసే పరిస్థితులు ఉంటున్నాయి. తద్వారా కొంత మంది ఓటేసేందుకు ఆసక్తి చూపించడం లేదని ఎన్నికల సంఘం గుర్తించింది. అందుకే ఒక కుటుంబంలోని ఓటర్లందరూ ఒకే పోలింగ్ కేంద్రం పరిధిలోకి వచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నారు. బీఎల్‌వోల సహకారం లేదా సాంకేతిక సాయంతో ఈ ప్రక్రియకు పూనుకుంటున్నారు. శాసనసభ ఎన్నికలతో పోల్చితే ఓటర్ల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. 2024 సంవత్సరానికి సంబంధించి ఓటర్ల ముసాయిదా జాబితా ఇప్పటికే విడుదలైంది. దీని ప్రకారం జనవరి 6 నాటికి పోలింగ్ కేంద్రాల వారిగా ఓటర్ల జాబితాను ప్రకటించాల్సి ఉంది. అయితే ఏప్రిల్ ఒకటవ తేదీతో 18 ఏళ్ల నిండినవారు ఓటరుగా నమోదు చేసుకునేందుకు మరో అవకాశాన్ని కూడా ఎన్నికల సంఘం కల్పించినందు వల్ల ఓటర్ల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. ఏప్రిల్ 15 వరకు కొత్త ఓటర్ల నమోదుకు గడువు ఉంది. గతంలో జనవరి 1వ తేదీ వరకు 18 ఏళ్లు నిండిన వారికే అవకాశం ఉండేది. కానీ ఈసారి ఏప్రిల్ 1వ తేదీ వరకు అవకాశం కల్పించారు. దీనిని దృష్టిలో ఉంచుకొని కొత్తగా ఏర్పాటయ్యే పోలింగ్ కేంద్రాలను బట్టి ఓటర్ల జాబితాను ప్రకటించే అవకాశం ఉంది. మార్పులు, చేర్పులు, విచారణ అనంతరం తుది జాబితాను ప్రకటిస్తారు.

పోలింగ్ కేంద్రాల్లో ఓటర్ల సంఖ్య:

ప్రస్తుతం పోలింగ్ కేంద్రాల వారీగా గరిష్ఠంగా 1,300 వరకు ఓటర్లను చేర్చారు. కొన్ని పోలింగ్ కేంద్రాల్లో అత్యధికంగా 1,290 మంది ఓటర్లు ఉండగా మరికొన్ని పోలింగ్ కేంద్రాల్లో అతితక్కువగా 300 మంది ఓటర్లు ఉన్నారు. ఎస్టీ రిజర్వుడ్ నియోజకవర్గాల్లో చాలాచోట్ల ఓటర్ల సంఖ్య తక్కువగానే ఉంది. సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఒక పోలింగ్ కేంద్రంలో ఓటర్ల సంఖ్య గరిష్ఠంగా 1,500 ఉండేలా చూడాలని అధికారులు నిర్ణయించారు. అదే సమయంలో ఓటర్లకు పోలింగ్ కేంద్రం ఎక్కువ దూరం ఉండొద్దని భావిస్తున్నారు. 1,500 మంది కంటే అధిక ఓటర్లుంటే ఆయా చోట్ల కొత్త పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసే అవకాశాలున్నాయి. ఇటీవల శాసనసభ ఎన్నికల సమయంలో ఏదేని పోలింగ్ కేంద్రంలో ఇబ్బందులు తలెత్తినట్లు గుర్తించినా, ఓటర్లకు దూరంగా ఉన్నట్లు ఫిర్యాదులు అందినా నూతన పోలింగ్ కేంద్రాల ఏర్పాటుపై అధికారులు నిర్ణయం తీసుకోనున్నారు. మార్పులు, చేర్పుల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల సంఖ్య స్వల్పంగా పెరిగే అవకాశముందని సమాచారం

మరో సారి పోలింగ్ కేంద్రాల పరిశీలన


ఇటీవలి శాసన సభ ఎన్నికల సందర్భంగా ప్రతీ పోలింగ్ కేంద్రంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అయినప్పటికీ ఆయా పోలింగ్ కేంద్రాలను మరోసారి పరిశీలించి నివేదిక అందించాలని ఎన్నికల సంఘం డిసెంబర్‌లోనే ఆదేశించింది. మహబూబాబాద్, వరంగల్ లోక్‌సభల పరిధిలోని 14 శాసనసభ సెగ్మెంట్లలో అయా ఎన్నికల నిర్వహణాధికారులు, రెవెన్యూ అధికారులు ఆ మేరకు పోలింగ్ కేంద్రాల పరిశీలన పూర్తి చేసి కలెక్టర్లకు నివేదిక అందించారు.

పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు

ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం యువత, మహిళ, దివ్యాంగుల కోసం ఆదర్శ పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసి ఆకర్షణీయంగా తీర్చిదిద్దాల్సి ఉంది. నియోజవర్గానికి మూడో వంతున ఆదర్శ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. పోలింగ్ కేంద్రాలను భవనంలోని కింది అంతస్థులోనే ఏర్పాటు చేయాలన్న నిబంధనలు ఉన్నాయి. సీనియర్ సిటిజన్లు, దివ్యాంగు లు మొదటి అంతస్థులోకి వెళ్లి ఓటు వేసేందుకు ఇబ్బంది పడతారన్న ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నది. దివ్యాంగులు ఓటు వేసేందుకు వీలుగా ర్యాంపులు ఏర్పాటు చేసేలా శ్రద్ధ తీసుకుంటున్నారు. అన్నిచోట్ల తాగునీటి వసతి ఏర్పాటు చేయాలి. రాజకీయ పార్టీలకు చెందిన ఏజెంట్లు, ఎన్నికల సిబ్బంది పోలింగ్ రోజు కూర్చోవడానికి అవసరమైన ఏర్పాట్లు చేయాలి. విద్యుత్ సౌకర్యం, వేసవి ఎండల తీవ్రత ఉండటంతో ఫ్యాన్లను ఏర్పాటు చేయాలి. గాలి, వెలుతురు ఉండే భవనాలను పోలింగ్ కేంద్రాల కోసం ఎంపిక చేయాలి. అత్యవసర పరిస్థితుల్లో విద్యుత్ సరపఫాలో అంతరాయం ఏర్పడితే జనరేటర్ సమకూర్చుకోవాలి. మూత్రశాలలు, మరుగుదొడ్లు ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి. పోలింగ్ రోజు ఓటర్లకు నీడ కల్పించేందుకు షామియానా ఏర్పాటు చేయాలి. వృద్ధులు, దివ్యాంగులు కూర్చోవడానికి వీలుగా అవసరమైనన్ని బెంచీలు అందుబాటులో ఉంచాలి. మెడికల్ కిట్లతో పాటు వేసవి దృష్ట్యా ముఖ్యంగా ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందు బాటులో ఉంచాలి. పోలింగ్ కేంద్రం వద్ద వైద్య సిబ్బంది అందుబా టులో ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి. వృద్ధులు, దివ్యాంగులు ఓటు హక్కు వినియోగించుకోవడానికి సహకరించేలా వలంటీర్లను నియమించుకోవాలి. కేంద్రాలకు రాలేని వారి కోసం ప్రత్యేక రవాణా సౌకర్యం ఏర్పాటు చేయాలి. ఓటు ప్రాధాన్యతను తెలిపే గోడపత్రికలను పోలింగ్ కేంద్రాల బయట అందుబాటులో ఉంచాలి. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలతో క్షేత్రస్థాయిలో పోలింగ్ కేంద్రాలను పరిశీలించి అవసరమైన వసతులు కల్పించేందుకు శ్రద్ధ తీసుకోవడంపై అధికారులు దృష్టి పెట్టారు.

తిలకించి.. పులకించి

- వైభవంగా నరసింహుని రథోత్సవం
- కొమ్మాలకు భారీగా తరలివచ్చిన భక్తులు
- కిక్కిరిసిపోయిన క్యూలైన్లు





శ్రీలక్ష్మీనరసింహస్వామి గర్భగుడి ప్రాంగణంలో బారులు తీరిన భక్తులు, స్వామివారి రథం

గీసుగొండ, మార్చి 29: కొమ్మాల శ్రీలక్ష్మీనరసింహస్వామి రథోత్సవం శుక్రవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. రథోత్సవం సందర్భంగా స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకునేందుకు ఉదయం నుంచి భక్తులు పెద్దసంఖ్యలతో తరలివచ్చారు. దీంతో ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. ఉత్సవమూర్తులను దర్శించుకునేందుకు భక్తులు గంటల తరబడి క్యూలైన్‌లో వేచియున్నారు. సాధారణ దర్శనానికి 3 గంటలు పట్టింది. ప్రత్యేక, శీఘ్ర దర్శనాల క్యూలైన్‌లు కిక్కిరిసిపోయాయి. ఆలయానికి వెనుక వైపు నుంచి వచ్చే శీఘ్ర దర్శన మార్గం ఇరుకుగా ఉండటంతో గాలి ఆడక భక్తులు అవస్థలు పడ్డారు. శుక్రవారం ఒక్కరోజే 25వేల మందికి పైగా దర్శించుకున్నట్లు ఆలయ ఈవో శేషగిరిరావు తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ పవన్‌కుమార్, ఎస్ఐలు వెంకన్న, జానీపాష పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

మారుమోగిన గోవింద నామస్మరణ

బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడో ఘట్టం ఉత్సవమూర్తుల రథోత్సవం శుక్రవారం రాత్రి అత్యంత వైభవంగా నిర్వహించారు. 25 ఫీట్లు ఎత్తులో ఉన్న రాతి చక్రరథంను రంగులు, పూలతో అందంగా అలంకరించారు. శ్రీలక్ష్మీనరసింహస్వామిని, భూదేవి, నీలాదేవిల ఉత్సవ మూర్తులను రథంలో ఆలయ గుట్ట చుట్టూ ఊరేగించారు. రథంపై పసిడికాంతుల్లో వెలుగొందుతున్న ఉత్సవమూర్తులను తిలకించి భక్తులు పులకించిపోయారు. రథోత్సవం సందర్భంగా వేదపండితుల మంత్రోచ్చారణలు, భక్తులు గోవిందా నామస్మరణలు మారుమ్రోగాయి. రథాన్ని గుట్ట చుట్టూ తిప్పేందుకు భక్తులు పోటీపడ్డారు. మమ్మేలు స్వామి.. మా కోర్కెలు తీర్చే దేవుడివంటూ భక్తులు సందడి చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ శ్రీనివాసాచార్యులు, అర్చకులు రామాచార్యులు, ఫణీంద్ర, విష్ణు, ఎంపీపీ భీమగాని సౌజన్య, ఎంపీటీసీ గోపాల్, ఈవో శేషగిరి, ఉత్సవ కమటి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు. కాగా ఉగాది వరకు జాతర కొనసాగుతుందని జాతర నిర్వహకులు తెలిపారు.

రసకందాయం

(5వ పేజీ)

కడియం శ్రీహరి కాంగ్రెస్‌లో సుముఖత వ్యక్తం చేయడంతో ఆయనతో పాటు డాక్టర్ కడియం కావ్య కూడా కాంగ్రెస్‌లో చేరనున్నారు.

నేడు కాంగ్రెస్ గూటికి కడియం

సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కడియం శ్రీహరి, కావ్య శనివారం కాంగ్రెస్ గూటికి చేరనున్నారు. వరంగల్ పార్లమెంట్ స్థానంపై కడియంకు కాంగ్రెస్ హామీ ఇవ్వటంతో కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధమవుతున్నారు. అయితే వరంగల్ స్థానం తన కుమార్తెకు ఇవ్వాలని శ్రీహరి కోరుతున్నారు. కానీ శ్రీహరినే వరంగల్ ఎంపీగా బరిలో దించింతేనే విజయావకాశాలు ఉంటాయని భావిస్తున్న కాంగ్రెస్.. ఆ తర్వాత స్టేషన్‌ఘనపూర్ అసెంబ్లీ స్థానానికి వచ్చే ఉపఎన్నికల్లో కావ్యకు టికెట్ ఇస్తామని హామీ ఇస్తున్నారు. కానీ శ్రీహరి మాత్రం తన కుమార్తెకు ఎంపీ టికెట్ ఇస్తేనే బాగుంటుందని ఒత్తిడి తెస్తున్నారు. శనివారం పార్టీలో చేరిన తరువాత అధిష్టానం ఏ నిర్ణయం తీసుకుంటే దానికి కట్టుబడి ఉంటానని స్పష్టం చేసినట్టు సమాచారం. దీంతో వరంగల్ ఎంపీగా కడియం ఫ్యామిలీ నుంచి ఒకరు పోటీలో ఉండటం పక్కా అనేది స్పష్టమైందన్న చర్చ జరుగుతోంది.

కాంగ్రెస్ ఆశావహుల్లో అయోమయం

వరంగల్ టికెట్ కోసం టీపీసీసీకి 42మంది దరఖాస్తు చేసుకోగా.. వీరితో పాటు మరో అరడజను మందకి పైగా రేసులో ఉన్నారు. రెండు నెలలుగా కాంగ్రెస్ అధిష్ఠానం వారి జాబితాను వడపోసి.. నలుగురైదుగురు పేర్లతో తుది జాబితాను సిద్ధం చేసింది. వీరిలో ప్రముఖంగా కాంగ్రెస్ సీనియర్ నేతలు శనిగపురం ఇందిర, దొమ్మాటి సాంబయ్య, జన్ను పరంజ్యోతి, రాగమళ్ల పరమేశ్వర్, పెరుమాండ్ల రామకృష్ణ, బొడ్డు సునితతో పాటు మరో డజను మందికి పైగా తీవ్ర ప్రయత్నాలు చేశారు. వీరిలో ఒకరికి టికెట్ పక్కా అనుకున్నారు. నేడోరేపో వరంగల్ అభ్యర్థి పేరును అధిష్ఠానం ఖరారు చేస్తుందని భావించారు. అయితే అనూహ్యంగా కడియం శ్రీహరి తన కుమార్తె కావ్యతో కలిసి కాంగ్రెస్‌లోకి వస్తుండటంతో తమ పరిస్థితి ఏంటన్న ఆందోళనలో ఆశావహులున్నారు. ఇప్పటికే టికెట్ కోసం.. పెద్దల ఆశీస్సుల కోసమంటూ హైదరాబాద్, ఢిల్లీ చక్కర్లు కొట్టిన నేతలకు కడియం చేరిక మింగుడు పడటం లేదు.

అభ్యర్థి కోసం 'గులాబీ' పార్టీ అన్వేషణ


తాను ఎంపీగా పోటీ చేయలేనని కడియం కావ్య కేసీఆర్‌కు లేఖ రాయడంతో బీఆర్ఎస్ మరో బలమైన అభ్యర్థిని వెతికే పనిలో పడింది. అయితే ఉద్యమకారులకే టికెట్ ఇవ్వాలని కొంత కాలంగా డిమాండ్ వినిపించగా.. తాజా పరిస్థితుల్లో ఆ డిమాండ్ మళ్లీ తెరపైకి వచ్చింది. మాజీ కార్పొరేటర్ డిన్నా, జోరిక రమేష్ పేర్లను పరిశీలిస్తున్నట్టు తెలిసింది. ఇదే క్రమంలో నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి సతీమణి పెద్ది స్వప్నను బరిలో దించాలని కొందరు నేతలు సూచిస్తున్నారు. ఇక ఇటీవలే బీఆర్ఎస్‌కు రాజీనామా చేసిన మాజీ ఉపముఖ్యమంత్రి తాటికొండ రాజయ్య మళ్లీ గులాబీ గూటికి చేరుతారని, ఆయన్ను పార్టీలోకి తీసుకుని ఎంపీ టికెట్ ఇస్తారనే ప్రచారం కూడాఉంది. మరోవైపు ప్రజాశాంతి పార్టీ వరంగల్ అభ్యర్థిగా ఖరారైన సినీనటుడు బాబుమోహన్‌ను బీఆర్ఎస్‌లో చేర్చుకుని, ఆయన్నే అభ్యర్థిగా ప్రకటించొచ్చని సోషల్ మీడియాలో వార్త చక్కర్లు కొడుతోంది.

కడియంపై గులాబీ నేతల గుర్రు..

కడియం శ్రీహరి తీరుపై ఆ పార్టీ శ్రేణులు భగ్గుమంటున్నాయి. మాజీ ప్రభుత్వ చీఫ్‌విప్ వినయ్‌భాస్కర్‌తో ఆటు మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్‌రెడ్డి, చల్లా ధర్మారెడ్డి, గండ్ర వెంకటరమణారెడ్డి, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి తదితరులు మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేసి ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరాలని డిమాండ్ చేశారు. నా డు ఎన్టీఆర్‌కు, నేడు కేసీఆర్‌కు కడియం శ్రీహరి వెన్నుపోటు పొడిచారని ఆరోపించారు. హనుమకొండ, స్టేషన్‌ఘనపూర్‌తో పాటు పలు చోట్ల కడి యం శ్రీహరి దిష్టిబొమ్మలను బీఆర్ఎస్ కార్యకర్తలు దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. మొత్తానికి కడియం శ్రీహరి పొలిటికల్ యూటర్న్ ఓరుగల్లు రాజకీయాలను వేడెక్కిస్తోంది.

కడియం చేరికపై కార్యకర్తల్లో అసంతృప్తి

స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ సింగపురం ఇందిర



కార్యకర్తలతో మాట్లాడుతున్న ఇందిర

స్టేషన్‌ఘన్‌పూర్, మార్చి29: స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కాంగ్రెస్ పార్టీలో చేరుతుండడంపై కాంగ్రెస్ కార్యకర్తలు అసంతృప్తితో ఉన్నారని స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చార్జి సింగపురం ఇందిర అన్నారు. శుక్రవారం స్టేషన్‌ఘన్‌పూర్‌లో ఆమె మాట్లాడుతూ 30 ఏళ్లుగా కడియం శ్రీహరి కాంగ్రెస్ కార్యకర్తలను పెట్టిన ఇబ్బందులను దీపాదాస్ మున్షికి వివరించామన్నారు. రెండు రోజుల్లో వేలాది మంది కార్యకర్తల సమక్షంలో భారీ సభ ఏర్పాటు చేసి కడియం శ్రీహరి చేరికను కాంగ్రెస్ కార్యకర్తలు ఏ రకంగా వ్యతిరేకిస్తున్నారో అధిష్ఠానం దృష్టికి తీసుకెళతానన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కీసర దిలీప్‌రెడ్డి, లొక్కుంట్ల ప్రవీణ్, దామెర నాగరాజు, బిట్ల బాబు, బూడిది సదానందం, చీటకోరు సంపత్, బండ రమేశ్, మందపురం ఉపేందర్, దేవరాయ రాజు, ఏలె మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పదవికి కడియం రాజీనామా చేయాలి..

నమ్మకంతో గెలిపిస్తే కేసీఆర్‌ను, ప్రజలను మోసం చేశాడు ● జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

ధర్మసాగర్, మార్చి 29: నీతి, నిజాయితీ ఉంటే ఎమ్మెల్యే పదవికి కడియం శ్రీహరి వెంటనే రాజీనామా చేయాలని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో మండల పార్టీ అధ్యక్షుడు రాజు అధ్యక్షతన నిర్వహించి విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్టేషన్‌ఘన్‌పూర్ ప్రజలు కడియం శ్రీహరిని ఎంతో నమ్మకంతో ఎన్నికల్లో గెలిపిస్తే ఆయన మోసం చేసి బీఆర్ఎస్‌లో ఉన్న నాయకులను ఒక్కొక్కరిని పార్టీ నుంచి బయటికి పంపిస్తున్నాడని తెలిపారు. డబ్బులు, పదవులు తీసుకుని బీఆర్ఎస్ పార్టీకి, తెలంగాణ అస్తిత్వానికి కడియం ప్రమాదకరంగా మారాడని విమర్శించారు. రాజకీయాల్లోకి వచ్చినప్పటి నుంచి కడియం తెలంగాణ ఉద్యమంలో లేడని, మాదిగ పోరాట సమితిలో లేడని, అహంకారంతో వ్యవహరిస్తూ ఏ పార్టీ అధికారంలో ఉంటే, అపార్టీకి అండగా ఉంటూ, ఆ పార్టీలో పదవులను పొందడం సిగ్గు చేటన్నారు. ఎస్సీ రిజర్వేషన్‌తో ఎన్నో పదవులను అనుభవించి ఏనాడు మాదిగలకు సహాయం చేయకుండా, పార్టీలో, రాజకీయంగా ఎదగనీయకుండా వ్యవహరించాడని విమర్శించారు. నాడు ఎన్టీఆర్‌కు, నేడు కేసీఆర్‌కు వెన్నుపోటు పొడిచి ఘన్‌పూర్ నియోజకవర్గానికి మోసం చేశాడన్నారు. బిడ్డ కోసం ముసలితనంలో పదవుల కోసం దిగజారడం సరి కాదన్నారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే లేని లోటును తానే తీరుస్తానని నాయకులకు, కార్యకర్తలకు పల్లా భరోసా ఇచ్చారు. రానున్న ఎంపీ, ఎమ్మెల్యే ఉప ఎన్నికల్లో మాదిగ బిడ్డను గెలిపించుకుందామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సరిత, జిల్లా నాయకులు ప్రభుదాస్, చాడ కుమార్, ఎంపీటీసీ శోభ, జూబేద, లాల్, నర్సింగరావు, జానీ మండల నాయకులు సుదర్శన్, తదితరులు పాల్గొన్నారు.

'మత్స్య'ఘాతం

కరెంట్ షాక్‌తో చేపల వేట..

ప్రాణాలతో వేటగాళ్ల చెలగాటం



సాధారణంగా చేపలను వలవేసి, లేదా గాలాలు వేసి పడతారు. మరీ ఎక్కువగా చేపలు ఉంటే నీటి ప్రవాహానికి అడ్డంగా కట్టలు వేసి వేటాడుతారు. కానీ కొందరు ఇందుకు భిన్నంగా కరెంట్ షాక్‌తో చేపలను పడుతున్నారు. గీసుకొండ మండలం రాంపూర్ గ్రామం సమీపంలోని కాకతీయ కెనాల్‌లో శుక్రవారం కొందరు యువకులు కరెంట్ షాక్ ద్వారా చేపలు పడుతుండడం కనిపించింది. ఒక పొడవాటి కర్రకు విద్యుత్ వైర్లను కట్టి.. దానిని చేపలు ఉన్న చోట నీళ్లలో షార్ట్‌సర్క్యూట్ చేసి చేపలవేట సాగిస్తున్నారు. కరెంట్‌షాక్ తగలగానే చేప చనిపోయి నీళ్లపైకి తేలుతుంది. రెండు మీటర్లకుపైగా పొడవైన కర్రను ఉపయోగించడంవల్ల చేపలు వేటాడే వారికి స్వల్పంగా షాక్ తగులుందని చెబుతున్నారు. అయితే ఇదే పద్ధతిని అనుసరించి చాలామంది మృత్యువాత పడ్డ సంఘనలున్నా కొందరు పట్టించుకోకుండా ప్రమాదానికి దగ్గరగా వెళుతున్నారు.

ఫొటో : ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్, హనుమకొండ

నేడు నగరంలో నీటి సరఫరా బంద్

వరంగల్ కార్పొరేషన్, మార్చి 29: హనుమకొండ నయీంనగర్ నాలా వద్ద ఇంటర్ కనెక్షన్ పనులు జరుగుతున్న దృష్ట్యా కేయూసీ ఫిల్టర్ బెడ్ పరిధిలో నీటి సరఫరా అయ్యే ప్రాంతాల్లో నేడు (శనివారం) నీటి సరఫరా ఉండదని నగర పాలక సంస్థ ఈఈ బీఎల్ శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రోడ్డు విస్తరణ పనులకు అనుగుణంగా పైప్‌లైన్ ఇంటర్ కనెక్షన్ పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. కాగా కేయూ ఫిల్టర్‌బెడ్ నుంచి నీరు సరఫరా అయ్యే పబ్లిక్‌గార్డెన్, గుడిబండల్, కొత్తూరు, మచిలీబజార్, పద్మాక్షికాలనీ, యాదవనగర్, విద్యారణ్యపురి, హసన్‌పర్తి, భీమారం, చింతగట్టు, ముచ్చెర్ల, పలివేల్పుల, వంగపహాడ్, గుండ్లసింగారం, పెగడపెల్లి, గోపాలపురం, కేయూ జంక్షన్ ప్రాంతాల్లో ఒక్క రోజు పాటు నీటి సరఫరా ఉండదని వెల్లడించారు. నగర ప్రజలు గమనించి అధికారులకు సహకరించాలని పేర్కొన్నారు.

ఫోన్‌ట్యాపింగ్‌పై ఉన్నతస్థాయి సంస్థలతో

దర్యాప్తు చేయించాలి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటనారాయణ

కాళోజీ జంక్షన్, మార్చి 29: రాష్ట్రాన్ని దోచుకోవడానికి నిరంకుశ పాలకులుగా నిరంతరం కల్వకుంట్ల వంశ పారంపర్య రాజరికాన్ని అనుభవించడానికి కుట్రపూరితంగా కేసీఆర్ ఫోన్ ట్యాపింగ్ వ్యవహారాన్ని ఉపయోగించుకున్నారని ప్రముఖ సామాజిక, ఆర్థిక, రాజకీయ విశ్లేషకులు కూరపాటి వెంకటనారాయణ అన్నారు. శుక్రవారం హనుమకొండ బాలసముద్రంలోని ఆయన నివాసంలో ఉమ్మడి వరంగల్ జిల్లా పౌర స్పందన వేదిక ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్.. తన కులానికి చెందిన అనేక మంది పోలీసు అధికారులను, విశ్రాంత పోలీసు అధికారులను ఫోన్ ట్యాపింగ్‌లో కీలక పాత్ర పోషించడానికి నామినేటెడ్ పదవులు ఇచ్చి, మరికొంత మందికి ప్రమోషన్లు కల్పించి వినియోగించుకున్నారని ఆరోపించారు. తన బంధు వర్గానికి చెందిన సుమారు 30 మందికి పైగా బాధ్యతలు అప్పగించి రాజకీయ నాయకుల కార్పొరేట్ సంస్థల యజమానుల, రియల్ ఎస్టేట్ వ్యాపారులను బెదిరించి బ్లాక్‌మెయిల్ చేసి వేల కోట్ల రూపాయల ధనం, వేల ఎకరాల భూమిని సొంతం చేసుకున్నారని పత్రికల్లో కథనాలు వెలువడుతున్నాయని ఆయన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అనుమతి లేకుండానే హవాలా మార్గంలో సుమారు రూ.300కోట్లు చెల్లించి ఇజ్రాయిల్ దేశం నుంచి ఫోన్ ట్యాపింగ్ సామగ్రిని తెప్పించారని అన్నారు. పౌరస్పందన వేదిక నాయకుడు పుల్లూరు సుధాకర్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అనుమతి లేకుండా మిషనరీని తెప్పించడం మనీ ల్యాండరింగ్ కింద నేరంగా పరిగణిస్తారని అన్నారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం సాధారణమైన క్రిమినల్ యాక్టివిటీ కాదని, దీన్ని అనేక కోణాల నుంచి దర్యాప్తు చేసి పరిశీలించాల్సిన అవసరం ఉందని తెలంగాణ మేధావులు భావిస్తున్నారని ప్రముఖ సామాజిక వేత్త బొమ్మినేని పాపిరెడ్డి అన్నారు. ఈ వ్యవహారం దేశంలోనే కాదు.. ప్రపంచంలోనే అమెరికా మాజీ అధ్యక్షుడు నిక్సన్ వాటర్‌గేట్ కుట్ర కేసు కంటే దుర్మార్గమైనదని రాజకీయ విశ్లేషకుడు సోమా రాంమూర్తి అభిప్రాయపడ్డారు. రాజకీయాలకు అతీతంగా సుప్రీంకోర్టు సిట్టింగ్ లేదా రిటైర్డ్ న్యాయమూర్తుల ద్వారా విచారణ జరిపిస్తే వాస్తవాలు బయటకు రావడానికి అవకాశం ఉంటుందని ఇతర పౌర స్పందన నాయకులు అభిప్రాయపడ్డారు.

అదుపులోకి మంటలు



అగ్నిప్రమాదంలో బూడిదైన సామగ్రి



శుక్రవారం ఉదయం మరోసారి ఎగిసిన మంటలు

పోచమ్మమైదాన్/మట్టెవాడ, మార్చి 29: వరంగల్ పోచమ్మమైదాన్ చౌరస్తా సమీపంలోని జకోటియా షాపింగ్ కాంప్లెక్స్‌లో గురువారం రాత్రి జరిగిన భారీ అగ్నిప్రమాదం జరగ్గా... అర్ధరాత్రి దాటిన తర్వాత మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఇందుకోసం ఫైర్, డీఆర్ఎఫ్ సిబ్బంది తీవ్రంగా శ్రమించారు. అలాగే శుక్రవారం ఉదయంకూడా రెండో అంతస్థు నుంచి మంటలు మరోసారి ఎగిసిపడటంతో వెంటనే వాటిని ఆర్పేశారు. ఈ ప్రమాదంలో రెండు, మూడో అంతస్థుల్లోని బ్లాకులు పూర్తిగా కాలిపోగా.. ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అంతా ఊరిపిపీల్చుకున్నారు. అయితే కాంప్లెక్స్‌లో అగ్నిప్రమాద నిరోధక నిబంధనలను సరిగా పాటించకపోవడం వల్లే ప్రమాద తీవ్రత పెరిగినట్టు తెలుస్తోంది. ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ కార్యాలయంలో, వీ కన్వెన్షన్ హాల్‌లోని సామగ్రి, ఫర్నిచర్ బూడిదయ్యాయి. ఈ క్రమంలో శుక్రవారం విద్యుత్, అగ్ని మాపక శాఖ, పోలీసు క్లూస్ టీం, ఫోరెన్సిక్ బృందం, కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి శాఖల వారీగా కారణాలను విశ్లేషించి నివేదికను రూపొందించారు. ఆ నివేదికను కలెక్టర్‌కు అందజేయనున్నారు. మంటలను అదుపులోకి తెచ్చేందుకు సుమారు 5.30గంటల సమయం పట్టిందని, అర్ధరాత్రి తర్వాత నియంత్రించగలిగామని అగ్నిమాపక అధికారులు తెలిపారు.

రూ.70లక్షల ఆస్తి నష్టం

ప్రమాదానికి నిర్లక్ష్యమే కారణమని ఆయా శాఖలు తమ ప్రాథమిక విచారణలో తేలింది. ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్‌లో గతేడాది అధికలోడ్‌తో ఏసీలు కాలిపోయాయని స్థానికులు చెబుతుండగా.. ఇప్పుడు కూడా లోడ్ కన్నా ఎక్కువగా ఏసీలు వాడటంతోనే ఏసీలు బ్లాస్ట్ అయి మంటలు వ్యాప్తి చెందాయని విద్యుత్ శాఖ సిబ్బం ది పేర్కొంటున్నారు. కాంప్లెక్స్‌కు కార్పొరేషన్ నుంచి ఫైర్ ఎన్‌వోసీ 2014లో తీసుకొని ఇప్పటి వరకు దాన్ని రెన్యువల్ కూడా చేసుకోలేదు. పదేళ్లుగా యజమానులను హెచ్చరిస్తున్నా పట్టించుకోలేదని అధికారులు చెబుతున్నారు. కాంప్లెక్స్‌లోని ఫైర్ సేఫ్టీ పరికరాలు అమర్చినా ఏ ఒక్కటీ పనిచేయడం లేదని, ఆ పరికరాలను ఆర్నెల్లకోసారి తనిఖీ చేయాల్సి ఉండగా అలాంటి తనిఖీలు ఏవీ లేవన్నారు. ఇక ఈ ప్రమాదంలో సుమారు రూ.70 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ సేల్ మేనేజర్ ఇల్లందుల సందీప్‌కుమార్ మట్టెవాడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. 28న రాత్రి 7.05గంటలకు ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ కార్యాలయంలో సిబ్బంది ఆఫీసులో ఉండగా సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్ నుంచి పెద్ద శబ్దం వచ్చి కొన్ని క్షణాల్లోనే ఆఫీసులోని ఏసీల నుంచి మంటలు వచ్చాయన్నారు. సిబ్బంది మంటలను ఆర్పేందుకు ప్రయత్నించగా, పొగలు కమ్ముకోవడంతో బయటకు వచ్చామని, ఫైర్ స్టేషన్‌కు సమాచారం ఇచ్చామన్నారు. ఈ ప్రమాదంలో కాంప్లెక్స్‌లోని లైఫ్ ఇన్సూరెన్స్ ఆఫీస్, స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్ ఆఫీస్, బేరిఫ్ రెస్టారెంట్, వొడ్డిరాజు కన్వెన్షన్ హాల్, రిలయన్స్ డిజిటల్స్‌కు నష్టం వాటిల్లినట్టు తెలిపారు. మొత్తం నష్టం సుమారు రూ.70 లక్షలు ఉంటుందని ఇల్లందుల సందీప్‌కుమార్ తన ఫిర్యాదులో పేర్కొనగా.. ఆ మేరకు కేసు నమోదు చేశామని మట్టెవాడ సీఐ గోపి తెలిపారు.

క్లూస్ టీమ్, ఫోరెన్సిక్ అధికారుల పరిశీలన

సంఘటన జరిగిన జకోటియా కాంప్లెక్స్‌లో శుక్రవారం వరంగల్ ఏసీపీ నందిరాం నాయక్, పోలీసు క్లూస్ టీమ్ సభ్యుడు దేవేందర్, ఫోరెన్సిక్ సైంటిఫిక్ రాము, విద్యుత్ శాఖ అధికారులు, అగ్నిమాపక శాఖ అధికారులు ప్ర మాదానికి గల కారణాలను పరిశీలించారు. విద్యుత్ సంబంధించిన పరికరాలను పరిశీలించారు. అలాగే ఘటనా స్థలాన్ని మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు శుక్రవారం సందర్శించారు. అధికారులు, బాధితులతో మాట్లాడి ప్రమాదానికి కారణాలను తెలుసుకున్నారు. అలాగే వరంగల్ అర్బన్ కో ఆపరేటివ్ బ్యాంకు చైర్మన్, భారతీయ జనతా పార్టీ నాయకుడు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు కూడా షాపులను పరిశీలించి.. బాధితులకు ధైర్యం చెప్పారు.

మత సామరస్యానికి ప్రతీక రంజాన్



గూడూరు ఇఫ్తార్ విందులో పాల్గొన్న ప్రభుత్వ విప్ జాటోతు రాంచంద్రునాయక్, ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్, పార్టీ ఎంపీ అభ్యర్థి పోరిక బలరాంనాయక్

గూడూరు, మార్చి 29: మత సామరస్యానికి ప్రతీక రంజాన్ పండుగ అని ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోతు రాంచంద్రునాయక్, మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్, మహబూబాబాద్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి పోరిక బలరాం నాయక్ అన్నారు. గూడూరు మండల కేంద్రంలోని మస్జీద్‌లో శుక్రవారం సాయంత్రం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... రంజాన్ ఒక పవిత్రమైన పండుగ అని, మానవ సేవ చేయాలనే సందేశాన్ని మానవాళికి అందించే పండుగ అన్నారు. కార్యక్రమంలో పార్టీ మం డల అధ్యక్షుడు చిట్టి వెంకన్న, నాయకులు రసూల్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అధికారం అడ్డుపెట్టుకుని దోచుకున్నారు..

▸▸ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి పోరిక బలరాంనాయక్



సమావేశంలో మాట్లాడుతున్న బలరాంనాయక్

డోర్నకల్, మార్చి 29 : రాష్ట్రంలో పదేళ్ల పాటు అధికారంలో ఉన్న కేసీఆర్ వేల కోట్ల రూపాయలను దోచుకున్నారని మహబూబాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి, కేంద్ర మాజీ మంత్రి పోరిక బలరాం నాయక్ అన్నారు. శుక్రవారం డోర్నకల్‌లో స్థానిక కాంగ్రెస్ నాయకులు సుమీర్‌చంద్ జైన్ ఇంట్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ప్రాజెక్టుల పేరుతో ఖజానాను కొల్లగొట్టారని అన్నారు. మిగులు బడ్జెట్‌తో ఏర్పడ్డ రాష్ట్రాన్ని అప్పులపాలు చేశారని విమర్శించారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అత్యధిక ఎంపీ స్థానాలను గెలుచుకుంటుందని చెప్పారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు బత్తు శ్రీనివాస్, జగదీష్, సాధనాల వెంకటేశ్వర్లు, రెడ్డబోయిన భాస్కర్, గుగులోతు లాలునాయక్, వెంకటేశ్వర్లు, సర్వయ్య పాల్గొన్నారు.

అసత్య ఆరోపణలు చేస్తే సహించం : కాంగ్రెస్

నర్సింహులపేట, మార్చి 29 : డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ రాంచంద్రునాయక్‌పై అసత్య ఆరోపణలు చేస్తే సహించేది లేదని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జినుకల రమేష్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ నాయకులు కొందరు ఎమ్మెల్యేను టార్గెట్ చేస్తూ విమర్శించడం సరికాదన్నారు. కాంగ్రెస్ వంద రోజుల పాలనలో ఆరు గ్యారంటీలు అమలు చేశారన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో విచ్చలవిడిగా ఖర్చు చేసి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని విమర్శించారు. సమావేశంలో కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బొబ్బ సోమిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు ఇర్రి లింగారెడ్డి, సోషల్‌మీడియా ఇంచార్జి చిర్ర సతీష్‌గౌడ్, మండల నాయకులు శేరి రామకృష్ణ, అన్ని గ్రామాల అధ్యక్షులు, ముఖ్య నాయకులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

పాతాళంలో జలం

▸▸ అడుగంటిన భూగర్భ జలాలు ▸▸ ఎండుతున్న వరి, మొక్కజొన్న పంటలు ▸▸ ఎస్సారెస్పీ జలాలపైనే రైతుల ఆశలు





నెల్లికుదురు మండలం మునిగలవీడులో ప్రొక్లెయినర్‌తో బావి తీస్తున్న దృశ్యం, మరిపెడ మండలం తానంచర్లలో వరిని గేదెలను మేపుతున్న రైతు

నర్సింహులపేట, మార్చి 29 : భూగర్భ జలాలు అడుగంటి పాతాళంలోకి వెళ్లడంతో చేతికి అందివచ్చిన వరి, మొక్కజొన్న పంటలకు సాగునీటి కష్టాలు మొదలయ్యాయి. దీంతో రైతులు పంటలను కాపాడేందుకు పడరాని పాట్లు పడుతూ ఎస్సారెస్పీ జలాల కోసం ఎదురు చూస్తున్నారు. జిల్లాలోని 18 మండలాల పరిధిలో ఈ రబీ సీజన్‌లో వరి 1.28లక్షల ఎకరాలు, 49,891 ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగు చేశారు. చేతికి అందివచ్చి పంటలకు సకాలంలో సాగునీరు అందక బాధిత రైతులు అష్టకష్టాలు పడుతూ ఆందోళన చెందుతున్నారు. నర్సింహులపేట మండలం కౌసల్యదేవిపల్లి గ్రామానికి చెందిన ఏర్పుల వెంకన్న రెండు ఎకరాల వరి సాగు చేశారు. ఆకేరు వాగు ఎండిపోవడంతో సాగునీటి కోసం ఆకేరు వాగులో సెలిమే తీసి మోటారుతో నీటిని పంటకు చేరవేస్తున్నాడు. ఎండల తీవ్రత రోజు రోజుకు పెరుగుతుండడంతో జలాలుపాతాళంలోకి పడిపోతున్నాయి. బావులు, చెరువులు, జలాశయాల్లో నీరు క్రమేపి అడుగంటి పోతున్నాయి. గత యాడాదితో పోలిస్తే 15 సెంటీ మీటర్ల లోతులోకి నీరు అడుగంటినట్లు భూగర్భ జలశాఖ అధికారుల అంచనా. ముందుందు తాగునీటిఎద్దడి తీవ్రం కానున్నట్లు పరిశీలకులుఅంచనా వేస్తున్నారు.

పంటలు పశువుల పాలు..

జిల్లాలోని నర్సింహులపేట, చిన్నగూడూరు, నెల్లికుదురు, బయ్యారం, గూడూరు, గార్ల, డోర్నకల్, మరిపెడ, కేసముద్రం మండలాల్లో సాగునీరు సకాలంలో అందక చేతికి వచ్చిన పంటలు ఎండిపోతున్నాయి. దీంతో చేసేదేమి లేక రైతులు పశువులను మేపుతున్నారు. పంట చేలకు సరిపడా సాగునీరు అందక రైతులు ఎస్సారెస్పీ జలాల వైపు చూస్తున్నారు. ఎస్సారెస్పీ జలాలు జిల్లాలో డీబీఎం-60 కాల్వల నుంచి ఇతర పిల్ల కాల్వలకు ఏప్రిల్ నెల మొత్తం నీటిని విడుదల చేస్తే వరి, మొక్కజొన్న పంటలు చేతికి అందుతుందని, రాష్ట్ర ప్రభుత్వం ఎస్సారెస్పీ జలాల విడుదల కృషి చేయాలని రైతులు కోరుతున్నారు.

ఎస్సారెస్పీ జలాలు విడుదల చేయాలి

- కొత్త వెంకటయ్య, రైతు కౌసల్యదేవిపల్లి

ఎండల తీవ్రతతో భూగర్భ జలాలు అడుగంటిపోయాయి. జలాశయాల్లో నీరు పూర్తిగా తగ్గిపోయాయి. చేతికి అందివచ్చిన పంట చేను సాగునీరు అందక ఎండిపోతున్నాయి. ప్రభుత్వం, అధికారులు చొరవ తీసుకొని ఎస్సారెస్పీ జలాలు విడుదల చేయాలి.

హైవేపై గుంతలు పూడ్చివేత

నర్సింహులపేట, మార్చి 29 : నర్సింహులపేట మండల పరిధిలోని ఖమ్మం-వరంగల్ ప్రధాన రహదారిపై ఏర్పడిన గుంతలను స్థానిక ఎస్సై గండ్రాతి సతీష్ సొంత ఖర్చులతో శుక్రవారం పూడ్చివేయించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ మండలంలోని పడమటి గూడెం స్టేజీ నుంచి పెద్దనాగారం అమీర్యతండా వరకు సుమారు ఆరు కిలోమీటర్ల వరకు ఖమ్మం-వరంగల్ ప్రధాన రహదారిపై ఏర్పడిన గుంతలను పూడ్చివేయించామన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణను ప్రతీ పౌరుడు బాధ్యతగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్సై వెంకన్న, హెడ్‌పీసీ కృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

కేసముద్రం, మార్చి 29: కేసముద్రం స్టేషన్ బ్రహ్మంగారి కాలనీలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన ఆటో డ్రైవర్ హజామ్‌ఖాన్ కుటుంబానికి ముస్లిం కుల సంఘం మండల శాఖ ఆధ్వర్యంలో రూ.7500 నగదు, 50 కిలోల బియ్యాన్ని శుక్రవారం అందజేశారు కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు షేక్ ఖాదర్, మహ్మద్ హఫీజ్, షేక్ నయీం, యాకూబ్, షైబు సబానీ, షేక్ సర్వర్, గఫార్, రఫీ తదితరులు పాల్గొన్నారు.

మెస్ చార్జీలు విడుదల చేయాలి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, మార్చి 29 : రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల కాస్మోటిక్, మెస్ చార్జీలను వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి దామెర కిరణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహబూబాబాద్‌లో శుక్రవారం నిర్వహించిన సంఘం సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా కాస్మోటిక్, మెస్ చార్జీలను పెంచాలని, పెండింగ్‌లో ఉన్న మెస్, కాస్మోటిక్ చార్జీలను వెంటనే విడుదల చేయాలని అన్నారు. మెస్ బిల్లులు పెండింగ్‌లో ఉండడం వలన వార్డెన్లు మెనూ ప్రకారం భోజనం అందించటం లేదని పేర్కొన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా పెండింగ్ బిల్లులు విడుదల చేయాలన్నారు. సమావేశంలో నాయకులు సూర్యప్రకాష్, గంధసిరి జ్యోతిబసు, సింహాద్రి, హన్మ, రాకేష్, ప్రవీణ్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలి

▸▸ టీపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగిరెడ్డి



బయ్యారంలో శంకరయ్య దంపతులను సన్మానిస్తున్న టీపీటీఎఫ్ సభ్యులు

బయ్యారం, మార్చి 29 : టెట్ అర్హతతో సంబంధం లేకుండా ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలని టీపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.నాగిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బయ్యారం మండలం ధర్మాపురం ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్న శంకరయ్య ఈ నెలలో పదవీ విరమణ పొందనున్నారు. దీంతో శుక్రవారం స్థానిక బాలుర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడు శంకరయ్యకు టీపీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం మండల శాఖ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన నాగిరెడ్డి మాట్లాడుతూ ఉద్యోగ విరమణ చేస్తున్న ఉపాధ్యాయులకు గ్రాట్యుటీ కమ్యూటేషన్ సకాలంలో చెల్లించాలన్నారు. అంకితభావంతో సేవ చేసిన ఉపాధ్యాయులకు టెట్ అర్హతతో సంబంధం లేకుండా పదోన్నతులు కల్పించాలన్నారు. ప్రభుత్వాలు మారినా విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. అంతకు ముందు శంకరయ్య దంపతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో టీపీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి మనోహర్ రాజు, సంఘం జిల్లా అధ్యక్షుడు చుంచు శ్రీశైలం, జిల్లా కార్యదర్శి ఉప్పలయ్య, మండల అధ్యక్ష, కార్యదర్శులు మీరా, ప్రవీణ్‌కుమార్, సంఘ బాధ్యులు, ఉపాధ్యాయులు గండు లక్ష్మీనారాయణ, బెల్లి లక్ష్మయ్య, తీగల రమేష్, రచ్చ వెంకటేశ్వర్లు, హన్మంతు, వెంకటస్వామి, ఉపేందర్, శంకర్, శారద, జానకి పాల్గొన్నారు.

జిల్లాలో 41 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు

మహబూబాబాద్ టౌన్, మార్చి 29: మహబూబాబాద్ జిల్లాలో ఎండ తీవ్రత పెరిగి 41 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. శుక్రవారం కనిష్ఠ ఉష్ణోగ్రత 21.9 డిగ్రీలుగా, గరిష్ఠ ఉష్ణోగ్రత 41.1 డిగ్రీలుగా నమోదయ్యాయి. ఇప్పటి వరకు 40 డిగ్రీల వరకు నమోదైన ఉష్ణోగ్రతలు తాజాగా 41 డిగ్రీలు దాటడంతో ఎండ తీవ్రత పెరిగి ప్రజలు ఉక్కిరి బిక్కిరవుతున్నారు.

కంఠమహేశ్వరుడికి జలబిందెలతో పూజలు



చింతపల్లిలో కాటమయ్య వేడుకల్లో పూజలు చేస్తున్న విప్ రాంచంద్రునాయక్

సీరోలు, మార్చి 29 : మండలంలోని చింతపల్లి గ్రామంలో గౌడ కులస్థుల ఆరాధ్య దైవమైన కంఠమహేశ్వరుడి వేడుకల్లో ప్రభుత్వ విప్ జాటోతు రాంచంద్రునాయక్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. గ్రామంలో శుక్రవారం గౌడ మహిళలు జలబిందెలతో వెళ్లి కంఠమహేశ్వరుడికి పూజలు చేశారు. ఈ సందర్భంగా విప్ రాంచంద్రునాయక్ మాట్లాడుతూ... గౌడ కులస్థులు ఆనందోత్సవాల నడుమ కంఠమహేశ్వర స్వామి వేడుకలు జరుపుకోవాలని అన్నారు. ఈ వేడుకల్లో కేంద్ర మాజీ మంత్రి పోరిక బలరాం నాయక్, గౌడకుల పెద్దలు కొంపెల్లి సైదులు, జెర్రిపోతుల రంగన్నగౌడ్, మద్ది వీరన్న, జెర్రిపోతుల మహేష్, వెంకన్న, వీరభద్రం, మహిళలు పాల్గొన్నారు.

వైభవంగా వేట వేంకటేశ్వర స్వామి ఉత్సవాలు



అమ్మపాలెంలో వేట వేంకటేశ్వరస్వామి ఉత్సవాల్లో కుంకుమ పూజలు పాల్గొన్న భక్తులు

డోర్నకల్, మార్చి 29 : డోర్నకల్ మండలం అమ్మపాలెం గ్రామంలో శుక్రవారం శ్రీదేవి భూదేవి గోదాదేవి సమేత శ్రీ వేట వేంకటేశ్వరస్వామి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. గురువారం సాయంత్రం స్వామి వారిని గార్ల నుంచి అమ్మపాలెం గ్రామానికి తీసుకువచ్చారు. శుక్రవారం ఉదయం మహిళలు కుంకుమ పూజ నిర్వహించారు. అనంతరం సాయంత్రం దీపోత్సవ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమానికి అమ్మపాలెం, తహసీల్దార్ బంజర గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

ఘనంగా టీడీపీ ఆవిర్భావ వేడుకలు



టీడీపీ కార్యాలయంలో కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహిస్తున్న నేతలు

నెహ్రూసెంటర్, మార్చి 29 : మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో తెలుగుదేశం పార్టీ 42వ ఆవిర్భావ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆ పార్టీ కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అనంతరం ఆవిర్భావ కేక్ చేసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా టీడీపీ పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు కొండపల్లి రాంచందర్‌రావు మాట్లాడుతూ.. తెలుగు వారి ఆత్మగౌరవం కోసం ఎన్‌టీఆర్ తెలుగుదేశం పార్టీని స్థాపించి నేటికి 42 ఏళ్లు పూర్తయ్యాయని తెలిపారు. ఎన్‌టీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో అనేక అభివృద్ధి పథకాలు ప్రవేశపెట్టి పేదలకు అందించారన్నారు. పటేల్, పట్వారీ వ్యవస్థను రద్దు చేసి మండల వ్యవస్థను ప్రవేశపెట్టిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. రేషన్ షాపుల ద్వారా బియ్యం అందజేసి పేదల కడుపులు నింపిన మహోన్నత వ్యక్తి ఎన్టీఆర్ అని కొనియాడారు. తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్న సమయంలో అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేశారని చెప్పారు. కార్యక్రమంలో పిట్టల రాము, రామిరెడ్డి, కొండపల్లి రాంచంద్రమ్మ, రోజా, విజయ, దుర్గ, నర్సింహానాయక్, కోటి, బాలునాయక్, భూక్య బాలు, వీరన్న పాల్గొన్నారు.

కార్పొరేట్‌లకు ఊడిగం చేసిన బీజేపీని ఓడించాలి

▸▸ సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు నాగయ్య

మహబూబాబాద్ టౌన్, మార్చి 29 : పదేళ్ల అధికారంలో ఉండి కార్పొరేట్‌లకు ఊడిగం చేసిన బీజేపీని పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు జి.నాగయ్య పిలుపునిచ్చారు. మహబూబాబాద్‌లోని పెరుమాండ్ల జగన్నాథం భవన్‌లో శుక్రవారం సీపీఎం జిల్లా స్థాయి సమావేశం గునిగంటి రాజన్న అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా నాగయ్య మాట్లాడుతూ... అవినీతిని వెలికి తీస్తామని అధికారంలోకి వచ్చిన బీజేపీ దానిని చట్టబద్ధం చేసిందని విమర్శించారు. సీబీఐ, ఈడీ లాంటి సంస్థలను అడ్డం పెట్టుకుని ప్రతిపక్ష పార్టీల నేతలను బెదిరిస్తూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిందని ఆరోపించారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. కరువుతో నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్, ఆకుల రాజు, అల్వాల వీరయ్య కందునూరు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఘరానా మోసం

(5వ పేజీ తరువాయి)

పోలీసులు.. డబ్బులు తీసుకుని మోసం చేసిన వీరేశంను గురువారం రాత్రి నగరంలో అదుపులోకి తీసుకుని విచారించగా పలు విషయాలు తెలిపినట్లు ఆయన అన్నారు.

వరంగల్‌కు చెందిన కొత్త వీరేశం డబ్బులు సంపాదించాలనే అత్యాశతో తన కుమారుడు గోపీనాథ్, హైదరాబాద్‌కు చెందిన మిత్రుడు గూడూరు పవన్, ఇతడి భార్య వెంకట పద్మజతో ఒక ముఠాగా ఏర్పడ్డారని ఆయన తెలిపారు. ఈ నలుగురు.. మరో ఐదుగురితో ముఠాగా ఏర్పడి పలువురి వద్ద ఉద్యోగాలు ఇప్పిస్తామని డబ్బులు వసూలు చేసినట్లు గుర్తించామని ఆయన అన్నారు. వీరేశం ఐదుగురి నుంచి రూ.4కోట్ల 50 లక్షలు వసూలు చేసినట్లు ఆయన తెలిపారు. వీరేశం, అతడి స్నేహితుడు పవన్.. కరీంనగర్‌కు చెందిన ప్రతిమ ఆస్పత్రి యజమాని బోయినపల్లి శ్రీనివాస్‌రావు లాంటి పెద్దవారితో పరిచయాలున్నాయని ఉద్యోగాల పేరిట డబ్బులు వసూలు చేశారని ఆయన పేర్కొన్నారు. వీరికి ఉటుకూరి శ్రీనివాస్ అనే అడ్వకేట్ సహకరించినట్లు విచారణలో వీరేశం తెలిపినట్లు ఏసీపీ వెల్లడించారు.

వీరేశంను అదుపులోకి తీసుకుని అతడి వద్ద నుంచి రూ.25లక్షల విలువైన నగదు, బంగారం స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. మరో 8మంది పరారీలో ఉన్నట్లు ఆయన తెలిపారు. నిందితుల్లో కొత్త వీరేశంతోపాటు హైదరాబాద్‌కు చెందిన గూడూరు పవన్, గూడూరు పద్మజ, వరంగల్‌కు చెందిన కొత్త గోపీనాథ్, ఖమ్మంకు చెందిన ఉటుకూరి శ్రీనివాస్‌రావు, ప్రకాశం జిల్లాకు చెందిన బుచ్చిబాబు, నర్సంపేటకు చెందిన బోయినపల్లి రవిందర్‌రావు, వరంగల్‌కు చెందిన కొత్త అరుంధతి, కొత్త పూజిత ఉన్నారు. పరారీలో ఉన్నవారిని పట్టుకుంటామని, వీరి వెనుక ఎవరున్నా వదిలే ప్రసక్తే లేదని ఏసీపీ దేవేందర్ రెడ్డి తెలిపారు. విలేకర్ల సమావేశంలో సుబేదారి సీఐ సత్యనారాయణ రెడ్డి, ఎస్ఐ సాంబయ్య పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణ యాత్ర కరపత్రాల ఆవిష్కరణ

నెల్లికుదురు, మార్చి 29 : మహనీయుల మాసోత్సవాలలో భాగంగా ఏప్రిల్ 2 నుంచి 8వ తేదీ వరకు నిర్వహించే రాజ్యాంగ పరిరక్షణ యాత్ర కరపత్రాలను మాలమహానాడు ఆధ్వర్యంలో శుక్రవారం నెల్లికుదురులో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అద్దంకి యువసేన వ్యవస్థాపక అధ్యక్షుడు గార ఉపేందర్ మాట్లాడుతూ రాజ్యాంగ పరిరక్షణ యాత్రలో బహుజనులు, అంబేడ్కర్ వాదులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు కారం ప్రశాంత్, బుర్గుల రజిని, బొటుమంచి యాకయ్య, కారం రవి, బానాల వీరన్న గార అనిల్, వరుణ్ పాల్గొన్నారు.

తీగలవేణి ఉన్నత పాఠశాలకు
వస్తువుల వితరణ

గూడూరు, మార్చి 29 : గూడూరు మండలం తీగలవేణి ఉన్నత పాఠశాలకు అదే గ్రామానికి చెందిన మిడ్‌వెస్ట్ గ్రానైట్ సంస్థ రూ.1.10 లక్షలు విలువైన కంప్యూటర్, జిరాక్స్ మిషన్, సౌండ్‌బాక్స్, మౌత్, ప్రింటర్ బహూకరించింది. మిడ్‌వెస్ట్ సంస్థ జీఎం వినయేందర్‌రెడ్డి, అకౌంట్ మేనేజర్ మల్లయ్య, హెచ్‌ఆర్ హెడ్ అరుణ్ వస్తువులను శుక్రవారం పాఠశాలకు అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ... గ్రామీణ ప్రాంత విద్యార్థులు విద్యారంగంలో అభివృద్ధి చెందాలన్నారు. మారుమూల ప్రాంత విద్యార్థులు కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు తీసుకురావాలన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలని కోరారు. తీగలవేణి పాఠశాలకు మా సంస్థ ఎల్లవేళలా సహకరిస్తుందని స్పష్టం చేశారు.

ఘర్షణలో ఒకరి మృతి



భద్రు మృతదేహం

గూడూరు, మార్చి 29 : గూడూరు మండలం గుండెంగ శివారు తేజావత్ దంజతండాలో జరిగిన ఘర్షణలో ఒకరు మృతి చెందినట్లు ఎస్సై సీహెచ్.నగేష్ తెలిపారు. తేజావత్ దంజతండాకు చెందిన తేజావత్ భద్రు (45) అదే తండాకు చెందిన నవీన్ కుటుంబాలు హైదరాబాద్‌కు వలస వెళ్లి పని చేసుకుంటూ జీవిస్తున్నారు. మార్చి 3న హైదరాబాద్‌లో భద్రు కుమారుడు లక్ష్మణ్ మృతి చెందాడు. ఆపై కొడుకు అంత్యక్రియలు నిర్వహించేందుకు భద్రు కుటుంబం తేజావత్ దంజతండాకు వచ్చింది. దుర్గమ్మ పండుగ ఉండడంతో నవీన్ కుటుంబ సభ్యులు కూడా ఇటీవల తండాకు వచ్చారు. తన కుమారుడు లక్ష్మణ్ మృతికి నవీన్ కారణమంటూ నవీన్, కుటుంబ సభ్యులు అమ్మి, రేణుక, సునీతలతో శుక్రవారం భద్రు ఘర్షణకు దిగాడు. ఈ క్రమంలో ఇరువురి కుటుంబసభ్యులు దాడులకు పాల్పడ్డారు. ఈ దాడుల్లో భద్రు స్పృహ కోల్పోవడంతో నర్సంపేటకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. భద్రుకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భార్య విజయ ఫిర్యాదు మేరకు నవీన్, అమ్మి, రేణుక, సునీతలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నగేష్ తెలిపారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు : డీపీవో

దంతాలపల్లి, మార్చి 29 : వేసవిలో తాగునీటి ఎద్దడి పట్ల అప్రమత్తంగా ఉండి సమస్యను సత్వరమే పరిష్కరిస్తామని జిల్లా పంచాయతీ అధికారి హరిప్రసాద్ అన్నారు. మండలంలోని కుమ్మరికుంట్ల గ్రామంలో నీటి ఎద్దడిపై గ్రామస్థులు నిరసన వ్యక్తం చేయడంతో శుక్రవారం ఆయన స్పందించారు. గ్రామంలో అద్దె బోరును తీసుకోని నీటి సౌకర్యం కల్పిస్తామన్నారు. భగీరథ నీటిని అందించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇటీవల భూగర్భ జలాలు పడిపోవడంతో బావుల్లో కావల్సినంత నీటి లభ్యత లేదన్నారు. వేసవిని దృష్టిలో పెట్టుకొని తాగునీటిని సకాలంలో అందిస్తామన్నారు. కార్యక్రమంలో భగీరథ ఈఈ క్రిష్టారెడ్డి, ఎంపీవో అప్సర్‌పాషా, కార్యదర్శి పాల్గొన్నారు.

గుడుంబా స్థావరాలపై ఎక్సైజ్ దాడులు

▸▸ వెయ్యి లీటర్ల బెల్లం పానకం ధ్వంసం



బెల్లం పానకాన్ని ధ్వంసం చేస్తున్న దృశ్యం

బయ్యారం, మార్చి 29 : మండలంలోని కోయగూడెం, చుంచుబంధం తండాలో నాటుసారా కాస్తున్న పలు స్థావరాలపై శుక్రవారం జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించారు. జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి కిరణ్ నేతృత్వంలో ఎక్సైజ్ సీఐలు చిరంజీవి, నీరజ ఆధ్వర్యంలో ఎక్సైజ్ పోలీసులు కోయగూడెం, చుంచు బంధం తండాలో దాడులు నిర్వహించారు. పలు ఇళ్లలోతో పాటు సమీప పంట చేలలో గుడుంబా కాస్తున్న స్థావరాలపై దాడులు చేసి సుమారు వెయ్యి లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేసి రెండు కేసులు నమోదు చేశారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్సైలు అశోక్, కిరీటి, మౌనిక, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి



గడ్డం అశోక్ (ఫైల్)

గూడూరు, మార్చి 29 : గూడూరు మండలం మచ్చర్ల జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన గడ్డం అశోక్(50) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. గురువారం ఆయన స్నేహితుడైన శివకుమార్‌తో కలిసి మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం గురిమిళ్లలో జరిగిన ఓ శుభకార్యంకు హాజరై స్వగ్రామమైన నర్సంపేటకు బయలుదేరారు. సరిగ్గా మచ్చర్ల స్టేజీ వద్దకు రాగానే బైక్ అదుపు తప్పడం.. నర్సంపేట నుంచి మహబూబాబాద్ వైపు వెళ్లే పెట్రోల్ ట్యాంకర్ బైక్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో శివకుమార్ అక్కడికక్కడే మృతి చెందగా.. గడ్డం అశోక్ తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు అశోక్‌ను మహబూబాబాద్ ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచనల మేరకు వరంగల్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆయనకు భార్య ఉమ ఉన్నారు. ఉమ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నగేష్ తెలిపారు.

ఝాన్సీరెడ్డిపై ఆరోపణలు సరికాదు

▸▸ పీఏసీఎస్ చైర్మన్ కాకిరాల హరిప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న కాకిరాల హరిప్రసాద్

తొర్రూరు, మార్చి 29: అధికారాన్ని అడ్డుపెట్టుకొని దందాలు చేసే సంస్కృతి కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఝాన్సీరెడ్డికి లేదని పీఏసీఎస్ చైర్మన్ కాకిరాల హరిప్రసాద్ అన్నారు. నియోజకవర్గ ప్రజలకు సేవ చేసేందుకే రాజకీయాల్లోకి వచ్చారని, ఆమెపై అసత్య ఆరోపణలు చేయడం సిగ్గుచేటన్నారు. తొర్రూరులోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నిజాయితీగా పైసా పైసా సంపాదించుకున్నారని, ప్రజలను ఇబ్బంది పెట్టే సంస్కృతి కాదన్నారు. బీఆర్ఎస్ నాయకులు మైనింగ్, ఇసుక, గ్రానైట్ దందాలు చేస్తూ ఇతరులపై ఆరోపణలు చేస్తే ఊరుకునేది లేదన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి అన్ని రకాల చర్యలు చేపడుతున్నారని, వారిపై ఆరోపణలు చేస్తే కేసులు పెడుతామని ఆయన హెచ్చరించారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు సుంచు సంతోష్, సోమ రాజశేఖర్, పెదగాని సోమయ్య, శ్యాంసుందర్‌రెడ్డి, శ్రీనివాస్, మల్లేశం, లక్ష్మీనారాయణ, వెంకటేశ్వర్లు, భిక్షం, అనిల్, వెంకన్న, రాజు, మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.